జనరాజకీయం కోసం... రూ॥ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 6 | పక్షపత్రిక | మార్చి16-31, 2010




## అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు



మద్యనియంత్రణపై
మహిళాసత్తా రాష్ట్ర సదస్సు



మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై నడుం బిగించి పోరాడుతున్నందుకు గాను ఉత్తమ మహిళా నాయకురాలిగా రూ॥ 10 వేల అవార్డును అందుకున్న నిజామాబాద్ జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు ఎ.కె. లతకు నెహ్రూ యువజన కేంద్రం వారి ద్వారా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహూకరిస్తున్న నిజామాబాద్ ఎంపి మధుయాష్కీ గౌడ్




అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో మద్యం షాపులను తొలగించేందుకు నాయకత్వం వహించిన జయభాగ్యమ్మను లోక్‌సత్తా పార్టీ మహిళాసత్తా ఆధ్వర్యంలో వావిలాల గోపాలకృష్ణయ్య హాల్లో సత్కరించారు.



మద్యనియంత్రణ మహా ఉద్యమం అన్ని జిల్లాల్లో
50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసిన ర్యాలీ




## లోపలి పేజీల్లో...


తాత్కాలిక తాయిలలే పేదలను ముంచుతున్నాయి
- డా॥ జేపీ..............5

మహిళా సాధికారత
- ఎన్. సరోజాదేవి... 6

మద్యం విధానం మారాలి
- కె. గీతామూర్తి.......9

గ్రామీణ స్త్రీల పేదరికం
- డా॥ ఆలూరి విజయలక్ష్మి.... 11

ఆరోగ్యమే మహాభాగ్యం
- యమ్. మహాలక్ష్మి.....14

మహిళా బిల్లు.................
- యస్. వి. గజానని................15

నలిగిపోతున్న బాల్యం
- ఓగేటి శ్రీదేవి.............18

మహిళాశక్తి ప్రపంచానికి చాటుదాం..................20

ఫ్రీజోన్ పై నిజాలు చెప్పిందెవరో?.....................21

మహిళా అక్షరాస్యతకు మరో ఉద్యమం.. ..
- డా॥ సి. కృష్ణమోహన్‌రావు 22

సర్వజన సత్తా...............................................26

జిల్లాల సమాచారం ........................................28


# అభినందనలు

**సంపాదకీయం**

అమెరికాలో రాజ్యాంగం వచ్చాక 130 సంవత్సరాలపాటు పోరాటం జరిగి, చివరకు 1920వ సంవత్సరంలో మహిళలకు ఓటు హక్కు వచ్చింది. బ్రిటన్‌లో 500 సంవత్సరాల పోరాటం తరువాత 1928 సంవత్సరంలో మహిళలకు ఓటు హక్కు వచ్చింది. అట్లాంటిది మన దేశంలో రాజ్యాంగం వచ్చిన తొలి రోజునే, కులం, మతం, భాష, ప్రాంతం, లింగ వివక్ష ఇవన్నీ విస్మరించి వయోజన ఓటు హక్కు ఇస్తూ, మహిళలకు ఓటు హక్కు ఇచ్చారు. ప్రపంచ రాజ్యాంగాలలో మహిళలకు రాజ్యాంగం వచ్చిన తొలి రోజునే ఓటు హక్కు యిచ్చినటువంటి తొలి రాజ్యాంగం భారత రాజ్యాంగం.

ఇన్నేళ్లకు మహిళలకు ప్రాతినిధ్యం కోసం ఏర్పాట్లు చేయాలని చట్టం కోసం గట్టి పోరాటం జరుగుతోంది. ఈ రొటేషన్లు మూలంగా కొంత గందరగోళం వుంటుందని ఆందోళన చాలా మందికి వున్నమాట వాస్తవం. “అసాధ్యమైన అద్భుతం, సుసాధ్యమైన మంచికి శతృవు అవుతుంది” కాబట్టి, ఏదో ఒక రూపంలో మహిళలకు ప్రాతినిధ్యం యివ్వడం అవసరం.

మూడు కారణాలుగా మనం ఈ మార్పు రావాలని కోరుకుంటున్నాము. మొట్టమొదటిది, మహిళలు పెద్దయెత్తున రాజకీయంలోకి ప్రవేశించి రాజకీయ నాయకత్వం తీసుకున్నట్లయితే రాజకీయం అంటే నేర ప్రవృత్తి, అవినీతి అనే భావన హృదయాల్లో బాగా చొరబడిపోయిన ప్రజలను దాని నుండి బయటకు తీసే అవకాశం ఉంటుందనే ఆశ మొట్టమొదటిది. రెండవది, సభల లోపలగాని, ప్రభుత్వంలోగాని, రాజకీయంలోగానీ, బహిరంగ చర్చల్లోగాని ప్రమాణాలు బాగుపడతాయి. కేవలం తిట్టుకోవటం, అరచుకోవటం, గందరగోళం కాకుండా హేతుబద్ధమైన వాదనలతో, వాస్తవాలతో ప్రజా సంక్షేమానికి అనుగుణంగా చర్చలు జరుగుతాయి, ఆరోగ్యకరమైన వాతావరణం వస్తుందన్న ఆశ రెండవది. మూడవది, అధికారానికి అర్థం మారుతుందని. ఈ రోజు అధికారం అంటే పోలీసు అధికారం, అధికారం అంటే భూమి మీద అధికారం. అధికారం అంటే ఎక్సైజ్, కమర్షియల్ టాక్సెస్. కాని నిజంగా అధికారం అంటే విద్య అందించటం కావాలి, ఆరోగ్యం అందటం కావాలి, నైపుణ్యం పెరగటం కావాలి, ప్రతి వ్యక్తి ఎదగటం కావాలి. అందుకోసం నిజంగా సమాజంలో మహిళల సాధికారత రూపుదాలుస్తుందని ఆశిస్తూ దేశంలోని మహిళలందరికీ ఈ నూరవ మహిళా దినోత్సవం సందర్భంగా మనసారా అభినందనలు.

**‘నాకే కనుక మరుజన్మ వుంటే, నేను ఒక మహిళగా పుడతాను’ –మహాత్మా గాంధీ**

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

**మార్చి 16-31, 2010 సంపుటి - 1 సంచిక - 6**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# మన రాజ్యాంగం

### ఆర్టికల్ - 39

## పరిపాలన విధానంలో రాజ్యం అనుసరించవలసిన సూత్రములు

**రాజ్య పరిపాలనా విధానం ఈ క్రింది ఆశయములకు కట్టుబడిఉండవలెను.**

ఎ) పౌరులందరికీ స్త్రీ పురుషులకు సమాన జీవనోపాధులను కల్పించుట.

బి) దేశ వనరులు, వాటి పంపిణీ మరియు యాజమాన్యం యావత్ సంఘ ఔన్నత్యానికి దోహదపడే విధంగా ఉండుట.

సి) ఆర్థిక విధాన ఆచరణలో ఉత్పాదక వనరులు ఏ ఒక్కరిలోనూ, లేక కొద్దిమందిలోనూ కేంద్రీకృత అవ్వకుండా చూచుట, మరియు పరిపాలనా ఉత్పాదక వనరుల కేంద్రీకృతం వలన ఉత్పన్నమయ్యే హానినుండి సంఘమును రక్షించుట.

డి) స్త్రీ, పురుషులలో ఒకే పని చేసేవారికి ఒకే జీతం ఉండుట.

ఇ) స్త్రీ, పురుష కార్మికుల శక్తి సామర్థ్యములనూ, ఆరోగ్యస్థితినీ, పసివారి అమాయకత్వమునూ, దుర్వినియోగ నివారణ, వారి వయసుకూ, శక్తికి మించినది, తగనిది అనారోగ్యకరమైన వృత్తులలో నియమించుటను నిషేధించుట.

ఎఫ్) ఈ ప్రక్రియలో పసివారికి ఆరోగ్యకరమయిన స్వేచ్ఛాయుతమయిన గౌరవప్రదమయిన పరిస్థితులను కల్పించుట; వారి అభివృద్ధికై కల్పించు రక్షణలు వారిని నైతిక జారుడుతనము నుంచి సంఘ నిస్పృహ త్యజింపునుంచి కాపాడునవై ఉండుట.

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**ఒక మంచి తల్లి వంద మంది ఉపాధ్యాయులతో సమానం** - రామకృష్ణ పరమహంస

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజి 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా


ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com


### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్: **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**

# తాత్కాలిక తాయిలాలే బీదలని ముంచుతున్నాయి : జేపీ

## ప్రణాళికాసంఘం ఆగ్రహమే వాస్తవాలకు అద్దం పడుతోంది

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కేవలం ప్రజాకర్షక పథకాలుగానే మిగిలిపోతున్నాయని, ప్రజల పేదరికాన్ని, అనారోగ్యాల్ని మరింతగా పెంచేందుకు మాత్రమే అవి ఉపయోగపడుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరైన దిశానిర్దేశం లేకుండా రూపొందించి, అమలుచేస్తున్న పథకాల తీరుతెన్నులపై ప్రణాళికాసంఘం తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది.

దేశంలో బీదరికాన్ని, శ్రమదోపిడీని నివారించడంపై పరస్పర భిన్నమైన అభిప్రాయాలకు తావేలేదు. జనం వేదనల్ని, ఆకలిబాధల్ని నివారించడం, ఆరోగ్యభద్రతకు పెద్దపీట వేయడం, రైతుల స్థితిగతుల్ని మరింత మెరుగుపరచడాన్ని ప్రభుత్వం తొలి ప్రాధాన్యాలుగా తీసుకోవాల్సిందే. పేద, అల్పాదాయ వర్గాలవారి సంక్షేమం పేరుతో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలన్నీ అధికారపార్టీ స్వల్పకాలిక ప్రయోజనాల కోసం మాత్రమే, వాటిని అనాలోచితంగా అమలు చేయడంద్వారా ప్రభుత్వం ప్రజల భవిష్యత్‌ను నిర్దాక్షిణ్యంగా బలిపెడుతోంది. ఇది ఆకలి తీర్చుకోవడానికి రైతు పంటకోసం వుంచిన విత్తనాల్నే తినాల్సివచ్చిన చందాన వుంది.

***కిరోసిన్ సరఫరాకు బదులు సౌరకాంతితో పనిచేసే ఎల్ఇడి బల్బుల్ని ప్రజలకు సబ్సిడీపై అందించడంవల్ల మంచి ఫలితాలుంటాయి. ఇవి కాలుష్యాన్ని నివారించడంతోపాటు, పెట్రోలియం ఉత్పత్తుల వాడకాన్ని తగ్గిస్తాయి.***

రెండురూపాయల కిలోబియ్యం, సబ్సిడీ ధరలపై కిరోసిన్, ఉచితవిద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాల్ని జాతి ప్రయోజనాల్ని, లబ్దిదారుల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని మార్పులు చేయాలి. 80శాతంమంది ప్రజలకు తెల్లకార్డులిచ్చామని ప్రభుత్వం సగర్వంగా చెప్పుకుంటున్నప్పటికీ, ఇంకా లక్షలమంది ప్రజలు తెల్లకార్డులు లేవని ఫిర్యాదు చేయడం ప్రజాప్రయోజన విధానాల్ని అమలుచేయడంలో ప్రభుత్వ దారుణ వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోంది.

ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించి రాష్ట్రంలో నిజమైన పేదల్ని శాస్త్రీయంగా గుర్తించాలి. గ్రామపంచాయితీల ద్వారా కేంద్రప్రభుత్వం అందిస్తున్న ఆహార దినుసుల్ని సరైన లబ్దిదారులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలి. లబ్దిదారులకు బియ్యం సబ్సిడీ ఖచ్చితంగా అందేందుకు అనువుగా డబ్బురూపంలో చెల్లింపులు జరపాలి. ప్రభుత్వం సబ్సిడీ ధరలపై లబ్దిదారులకు అందిస్తున్న కిరోసిన్‌లో 50 శాతం నేరగాళ్ళ ముఠాల చేతుల్లోకి వెళ్తోంది. కిరోసిన్ సరఫరాకు బదులు సౌరకాంతితో పనిచేసే ఎల్ఇడి బల్బుల్ని ప్రజలకు సబ్సిడీపై అందించడంవల్ల మంచి ఫలితాలుంటాయి. ఇవి కాలుష్యాన్ని నివారించడంతోపాటు, పెట్రోలియం ఉత్పత్తుల వాడకాన్ని తగ్గిస్తాయి. మనదేశంలోనే పెట్టుబడుల్ని ప్రోత్సహించి ఉద్యోగాలు కల్పిస్తాయి. ప్రజాధనం మాఫియా చేతుల్లోకి పోకుండా రక్షించుకోవచ్చు.

వ్యవసాయానికి మీటర్లు లేకుండా ఉచిత విద్యుత్ అందించడం వల్ల రైతులు శక్తికి మించి పెట్టుబడులు పెట్టి బోర్లువేస్తున్నారు, ఫలితంగా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. మరోవైపు లోఓల్టేజీ సమస్యలవల్ల మోటార్లు కాలిపోయి మరింత నష్టానికి గురవుతున్నారు. ఈ పరిస్థితిని నివారించాలంటే మీటర్లుపెట్టి, కొంత పరిమితి వరకూ ఉచిత విద్యుత్‌నిచ్చి ఆపైన వినియోగానికి ప్రతి యూనిట్‌కీ సబ్సిడీతో టారిఫ్‌ను నిర్ణయించాలి. పంపిణీ వ్యవస్థను బాగుచేసి, ప్రతి గ్రామానికీ 24 గంటలు విద్యుత్తునందిస్తే పల్లెలు బాగుపడతాయి. యువతకు ఉపాధి అందుతుంది. అలాగే, ప్రతి మూడువేల ఎకరాల పరిధికీ ఒక అగ్రిక్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసి, రైతులకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని, సూచనల్ని అందిస్తూ, సరకు స్టోరేజ్, మార్కెటింగ్ అవకాశాల్ని కల్పించగలిగితే రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి.

రాష్ట్రప్రభుత్వపు అవాస్తవిక ప్రాధాన్యాలను, అనాలోచిత విధానాలను ఆరోగ్యశ్రీ మరోసారి రుజువు చేసింది. ఆరోగ్యశ్రీ వల్ల రోజుకు కేవలం 500 మందికే ప్రయోజనం కలుగుతోంది. మిగిలినవారంతా తాహతు లేకున్నా తమ జేబులోంచే ఖర్చు పెట్టుకోవాల్సివస్తోంది. కార్పొరేట్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ అమలవుతున్నప్పటికీ వాటివల్ల లబ్దిదారులకు కలుగుతున్న ప్రయోజనాలు అతిస్వల్పమే. ఆరోగ్యశ్రీ మీద పెడుతున్న ఖర్చులో కేవలం 10 శాతాన్ని ప్రభుత్వం ప్రాథమిక, మాధ్యమిక ఆరోగ్యభద్రత, రోగనివారణ అంశాలపై ఖర్చుచేస్తే ప్రజలను పలుజబ్బులనుంచి ముందే నివారించవచ్చని గతంలో అనేకసార్లు సూచించినా, ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.

ప్రణాళికాసంఘం అక్షింతలు పడ్డాక కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం గాఢనిద్రనుంచి మేల్కొని సబ్సిడీల గురించి పునస్సమీక్షించి, నిజమైన లబ్దిదారులకు ప్రయోజనం పొందేలా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాము.

# మహిళా సాధికారత

## మహిళలూ ! ఆ దిశగా అడుగులు వేద్దాం రండి



ఎన్. సరోజాదేవి

***చట్టసభల్లో మహిళలు పాత్ర కొంతకాలంగా కనిపిస్తూనే వుంది. అయితే 14 సంవత్సరాల సుదీర్ఘపోరాటం అనంతరం, ఇప్పుడు చట్టసభల్లో మహిళారిజర్వేషన్ విషయంలో 3వ వంతు ప్రాధాన్యానికి పోరాటంలో సగం గట్టెక్కినట్టు, రాజ్యసభలో మహిళాబిల్లు ఆమోదించబడింది. ఇక లోక్‌సభలో కూడా 33 శాతం రిజర్వేషన్ మహిళలకి ఇవ్వడానికి ఆమోదముద్ర పడితే, "మహిళలు అవకాశాల్లోనే కాదు - అధికారంలో కూడా ప్రజాప్రతినిధులుగా వుండి" తమ బాధ్యతని విజయవంతంగా నిర్వహిస్తారని భావిద్దాం.***

ప్రపంచంలోని ఏ దేశ వనితలకైనా.... తమ తమ సంస్కృతి, నాగరికత, విలువలను గౌరవించుకుంటూనే "మహిళా సాధికారత"ను పెంపొందించుకోవడంలో వారి వారి పట్టుదల, ఓర్పు, సహనం, శక్తిసామర్థ్యాలన్నవి ఒక్కటే. స్త్రీ అంటే శక్తిస్వరూపిణి. కార్యదీక్షతో ఏ పని చేయతలపెట్టినా, విజయాన్ని సాధించలేకపోవడం అంటూ ఉండదు. మహిళలు ఒంటరిగా సాధించగలిగే పనులు కొన్నుంటే,..... మహిళ అంటే జనాభాలో సగభాగమే కాదు, అభివృద్ధిలో – ఆలోచనల్లో కూడా భాగమే కనుక, విడి విడి వ్యక్తులుగా వున్న మహిళలందరూ సంఘటితంగా, ఒకరినొకరు కలుపుకుని చేసే ఉద్యమాలు, ప్రణాళికలు, పోరాటాలు వారికి మరింత ఘనకీర్తిని తెచ్చి పెడతాయి. మహిళాసాధికారత ప్రాముఖ్యతను ప్రపంచమంతటికీ నిరుపమానంగా తెలియచెబుతాయి.

"అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్నే" తీసుకుంటే... న్యూయార్క్ వంటి దేశాల్లో మగవారితో సమానంగా ఆడవారికీ ఫ్యాక్టరీలలో ఉద్యోగాలుండాలని మహిళలు నిరసనలు చేయడంతో, ఆయా పరిశ్రమల, కార్ఖానాల యజమానులు మహిళలను కార్మికులుగా చేర్చుకోవడంతో పాటు, రోజుకి 14 గంటలు వారిని పనిలో వినియోగించుకునేవారు. ఒకసారి ప్రమాదవశాత్తు న్యూయార్క్‌లోని దుస్తుల తయారీ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించి, అందులో పనిచేసే శ్రామిక మహిళలు ఎంతోమంది సజీవదహనం అయిపోయారు. దానికి నిరసనగా న్యూయార్క్, అమెరికా, ఐరోపా దేశాల్లోని శ్రామిక వర్గ మహిళలు 15,000 మంది వరకూ వీధుల్లో ఉద్యమాలు నడిపి, ప్రదర్శనలు నిర్వహించి ప్రపంచదేశాల మహిళలందరినీ ఉత్తేజపరుస్తూ.... 1. కార్మిక మహిళలకి భద్రత, రక్షణ కావాలనీ 2. వారి పని పరిస్థితులు మెరుగుపడాలనీ 3. వేతనాల పెంపుకోసం 4. ఓటు హక్కు కోసం, డిమాండ్ చేసి "హక్కుల సాధనలో" అగ్రభాగాన నిలిచారు. ఈ పోరాటానికి గుర్తుగానే, ప్రపంచదేశాల్లోని ఎన్నోదేశాలు ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన "అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని" ఒక గౌరవప్రదమైన విషయంగా, విజయానికి సంకేతంగా జరుపుకోవడం ఆనవాయితీగా పాటిస్తాయి. అయితే ఈ 2010 మార్చి 8వ తేదీని "నూరువసంతాల మహిళాదినోత్సవంగా" సంతోషంగా పూర్తి చేసుకోవడం జరిగింది. ఆ విధంగా ఆ కార్మిక మహిళలు మహిళాసాధికారతని ఘన విజయంతో సాధించి, ప్రపంచానికెల్ల చాటిచెప్పారు. చరిత్రలో నిలిపారు.

ఇక భారతీయ మహిళల విషయానికొస్తే... అధిక భాగం, వారి చదువు చూస్తే అంతంత మాత్రం. ఎంతసేపూ 'ఇల్లు, సంసారం, భర్త, పిల్లలు, అత్త-మామలు, బంధువులు' అంటూ తట్టెడు పనిని తలమీద మోస్తూ, తనని తానే మరుస్తున్న... చాలామంది స్త్రీలకు ఇప్పుడిప్పుడే నిద్రలోంచి లేచినట్టు, "బయటప్రపంచం, సమాజసేవ, సంఘజీవనం, సమాజంలోని కష్ట-సుఖాలు'', కళ్ళముందు కొట్టొచ్చినట్టు కనిపించడం మొదలుపెట్టాయి. అయినా వారిలో కొంతమంది మహిళామణులు కుటుంబ బంధనాలు తప్పించుకోలేక, సమాజసేవపట్ల ఆసక్తి వున్నా కుటుంబ సభ్యుల నుండి వచ్చే వ్యతిరేకత కారణంగా, అవి వాళ్ళ కాళ్లకు సంకెళ్లుగా విలవిల్లాడారు. ధైర్యం కలిగిన వాళ్ళు అయితే... ఒక మహిళగా తనవంతు 'ధర్మం, త్యాగం, సేవాతత్పరతలు' ఇంటికే పరిమితం కాకుండా, బయట ప్రజలకి పంచాలనే తపనతో గడపదాటి కాలు బైటపెట్టే పరిస్థితులు ఏర్పర్చుకున్నారు.

**"ఎవరో ఒకరు, ఎపుడో – అపుడు నడవరా ముందుగా అటో ఇటో-ఎటో వైపు,"** అనే ఒక సినీగీతంలోని మంచి భావంలాగా.... ఉద్యమస్ఫూర్తి కల్గిన ఎంతో మంది మహిళలు తమ తమ కుటుంబసభ్యుల సహకారంతోనే, 'గాంధీ మహాత్ముని' వెంట ఆ మంచి మార్గాన స్వాతంత్ర్య ఉద్యమాల్లో ప్రవేశించి, ప్రముఖ పాత్ర వహించి సంపూర్ణ సాధికారతను సాధించారు. దేశానికి, సమాజానికి ఏదో చేయాలనే తపనే వారినలా ముందుకు నడిపించింది.

అందుకే స్త్రీ శక్తి సామర్ధ్యాలు ఇంటికే పరిమితం చేయకుండా సంఘంలోని వివిధ జీవన రంగాలలో పురోభివృద్ధికి వినియోగిస్తే నిజమైన సాధికారత లభించినట్లే.

అంతేకాదు మహిళలకి, పురుషులతో బాటుగా సమానత్వం రావాలంటే విద్యలో రాణించి, ''స్థానిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో'' వారు క్రియాశీల భాగస్వాములు కావాలి. ఎదిగే అవకాశాలను స్వంతం చేసుకోవాలి.

**ముఖ్యంగా సాధికారత పెంపొందాలంటే...**

1. మహిళ తన జీవితానికి సంబంధించిన, సమాజానికి దోహదం చేసే అన్ని విషయాల్లో నిర్ణయాధికారం తీసుకోవాలి.
2. ప్రజాస్వామ్య వ్యవస్థలో తన పాత్రని పెంపొందించుకోవాలి.
3. ఎన్నికల్లో పోటీ చేసే సామర్థ్యాన్ని పెంచుకోవాలి.
4. నిర్ణయాత్మక శక్తిగా రూపొందాలి. మహిళలు అలా ఎన్నో విధాలుగా వృద్ధి చెంది, విజయమార్గంలో వెళ్ళగలిగినప్పుడే ఏదేనా సాధ్యపడుతుంది.

జనాభాలో సగభాగంగా వున్న మహిళలకి ప్రజాపరిపాలనను అప్పగిస్తే.. వారు కుటుంబ బాధ్యతని ఎంత సామర్ధ్యంతో నడపగలరో, ప్రజల పట్ల కూడా సమభావనని చూపగలరు. మగవారికి ధీటుగా వారి శక్తిసామర్థ్యాలను, చొరవ, తెలివితేటలను కనపరచి ప్రగతిని బలోపేతం చేయగలగడమే అసలైన సాధికారతకు అర్థం.

ఈ తరం మహిళల్లో మాత్రం 'ఉన్నత విద్యా – ఉన్నత ఉద్యోగాల పట్ల ఆసక్తి, పోటీతత్త్వం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విషయములలో కూలంకష అవగాహన' పెరిగాయి. అంతేగాక... ఇన్ఫోసిస్, విప్రో, కాగ్నిజెంట్, టి.సి.ఎస్. లాంటి పెద్ద పెద్ద వ్యాపార సంస్థల ఉద్యోగావకాశాల్లో మహిళలు దూసుకుపోతున్నారు. శభాష్ అనిపించుకుంటున్నారు.

అంతేకాదు ఒక 'చందా కొచ్చార్, ఇంద్రానూయి, కిరణ్ మంజూదార్‌షా' వంటి ఎంతో మంది మహిళలు కూడా కార్పొరేట్ రంగంలో ఉన్నత పదవుల్లో గౌరవాలు పొందుతున్నారు. అయితే ప్రైవేట్ రంగం చూసినా, కార్పొరేట్ రంగం చూసినా.. మహిళలు 'తమపిల్లలు, కుటుంబ బాధ్యతల వలన కెరీర్ విషయంలో కొద్దిగా వెనుక బడుతున్నారనే మాటలు వినబడుతున్నాయి. ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన కొద్దీ, సాధించిన విజయం చిన్నదిగా అనిపిస్తుంది. ''సాధికారత కూడా అంతే, ఎంత సాధించినా ఇంకా సాధించాల్సింది మిగిలే వుంటుంది".

ఇవన్నీ నాణానికి ఒకవైపు అయితే.. మరొక వైపు చూస్తే, "కనీససౌకర్యాలు, వసతులు లేక బడికి వెళ్లలేని ఆడపిల్లలెందరో



వున్నారు. మనదేశంలో బడికి వెళ్లే వయస్సుల్లోని బాలికల్లో ఇంచుమించు 20 శాతం పాఠశాలలకి వెళ్లడం లేదు. పాఠశాలలో పేరు నమోదయ్యి, హాజరీలేని విద్యార్థుల్లో అమ్మాయిల సంఖ్యే అధికం. జాతి అభివృద్ధి సూచికలో ఆడపిల్లల చదువులు కీలకంగా మారిన నేపథ్యంలో ఈ పెదధోరణుల్లో మార్పులు త్వరగా వస్తేనే, మహిళాభివృద్ధి మరింత వేగంగా సాధ్యమౌతుంది.

ప్రస్తుతం ప్రాథమిక విద్యారంగంలో... విద్య ప్రతి పిల్లా – పిల్లవాడి ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ కేంద్రం తీసుకు వచ్చిన "విద్యాహక్కు చట్టాన్ని" ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేస్తానని ప్రకటించడం హర్షించదగిన గొప్ప విషయం. విద్య ద్వారానే పిల్లల పరిణితి, పురోభివృద్ధి సాధ్యమౌతుంది. ఆ చదువు వలన బాలికలు ఉన్నత స్థితికి ఎదిగి.. జీవితంలో పూలబాటను ఏర్పరచుకోవాలి.

ఇక చట్ట సభల విషయంలో అయితే.. మహిళల పాత్ర అక్కడ కొంత కాలంగా కనిపిస్తునే వుంది. అయితే 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం అనంతరం, ఇప్పుడు చట్టసభల్లో 'మహిళా రిజర్వేషన్ విషయంలో 3వ వంతు ప్రాధాన్యానికి' పోరాటంలో సగం గట్టెక్కినట్టు, రాజ్యసభలో"మహిళాబిల్లు" ఆమోదించబడింది. ఇక లోక్‌సభలో కూడా 33 శాతం రిజర్వేషన్ మహిళలకి ఇవ్వడానికి ఆమోదముద్ర పడితే "మహిళలు అవకాశాల్లోనే కాదు, అధికారంలో కూడా ప్రజాప్రతినిధులుగా ఉండి" తమ బాధ్యతని విజయవంతంగా నిర్వహిస్తారని భావిద్దాం.

మహిళా సాధికారత సాధనలో మహిళా ప్రతినిధుల పాత్ర ప్రముఖమైనది కాబట్టి, పార్టీలకతీతంగా గ్రామస్థాయి నుండీ జాతీయ స్థాయి వరకూ వారు అందరూ సంఘటితం అయ్యి...

'పరిపాలన, రాజ్యాంగం, విధుల పట్ల పూర్తి స్థాయిలో అవగాహనని పెంపొందించుకుని, సంకల్పబలంతో ముందుకు వెళితే సాధించలేనిదంటూ వుండదు. చట్టసభల్లో మహిళలు ఉంటే, మహిళాభివృద్ధికి అవసరమైన చట్టాలు వస్తాయి. అవి ఖచ్చితంగా అమలౌతాయి. సామాజిక పరంగా మంచి మార్పులు వస్తాయి.

అయితే గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ఆర్థిక స్వావలంబనతో పైకి ఎదిగి కుటుంబానికి సహాయపడే ఆలోచనతోనైతేఏమి, స్వయం ఉపాధి కోసం అయితే ఏమి... డ్వాక్రా గ్రూపు, పొదుపు సంఘాలు, మహిళాసంఘాల వారు తక్కువ వడ్డీకి బ్యాంకు ఋణాలు పొందుతూ ఒక్క రాజకీయ రంగమే కాదు, ఏ రంగంలోనైనా మహిళాసత్తాను చాటి సాధికారతను పొందవచ్చని తేటతెల్లం చేసారు.

అది నిజమేనన్నట్లు! గ్రామీణ బ్యాంకు స్థాపకులు, 2006 నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ మాటల్లో... "వారి బ్యాంకు ద్వారా పురుషుల కంటే, స్త్రీలకి ఇచ్చిన ఋణసహాయం వలననే, ఆ కుటుంబాలకి లబ్ధి చేకూరుతోందనీ, అందుచేత ఆ గ్రామీణ బ్యాంకు మొత్తం ఋణాలలో 96 శాతం మహిళలకే అందజేస్తున్నారని" తెలియచేసారు.

***లోక్‌సత్తా పార్టీ విభాగమైన మహిళాసత్తా కూడా.. మహిళాసాధికారతను పెంపొందించే దిశగా అడుగులు వేస్తున్నది. ముదితల్‌నేర్వగలేని విద్యగలదే? అన్నట్లు మహిళలు చెయ్యలేని పని సాధించలేని విషయం అంటూ ఉండదు, అవకాశం వస్తే ఆకాశాన్నైనా అందుకోగలరు.***

ఇక లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థగా వున్నప్పుడే, మహిళలకి పెద్ద పీట వేసింది. ఆ సమయంలోనే "మంచి పాలన కోసం మహిళలు" అనే నినాదంతో 2005, ఏప్రిల్ 3వ తేదీన.. సికింద్రాబాద్‌లోని జీవనజ్యోతి సంస్థ అవరణలో ఏర్పాటు చేసిన సదస్సుకి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి గ్రామ పంచాయితీ వార్డుల, సభ్యుల మొదలు జడ్పీ ఛైర్మన్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ నుండి కార్పొరేషన్ ఛైర్మన్, 400 మంది ప్రతినిధులను ముఖ్య అతిధిగా కర్నాటక మాజీ గవర్నర్ శ్రీమతి ఎన్. రమాదేవిని ఆహ్వానించారు. అలాగే లోక్‌సత్తా ప్రతినిధులు వచ్చారు.

ఆ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం :- "73, 74 రాజ్యాంగ సవరణలు అమలుకోసం, స్థానిక ప్రభుత్వాల పటిష్టత కోసం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, మహిళా సాధికారత", సదస్సుకు అధ్యక్షత వహించినా డా॥జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ... "ప్రజాస్వామ్యం ముసుగులో పాతకాలం నాటి రాచరిక పాలన కొనసాగుతోందనీ, అధికారం చేతికి వస్తే - వ్యక్తి స్వార్థంతో ఎత్తులు, జిత్తులు వేసుకునే క్రీడగా చేస్తున్నారని చాలా మంది భావిస్తున్నారనీ, అందుకే ఆ పాత తరహా పాలనకు స్వస్తి చెప్పాల్సిన సమయం ఆసన్నమయ్యిందనీ... అధికారం అంటే 'సేవ' అనే కొత్త భాష్యాన్ని చెప్పటానికి 'మహిళా ప్రజా ప్రతినిధులు' ముందుకు రావాలనీ కోరారు. సామాన్య పౌరులు అసామాన్య ప్రతిభాపాటవాలు ప్రదర్శించడమే ప్రజాస్వామ్యమని, పరిపాలన గొప్ప విషయం కాదనీ, మహిళలు ఏదీ చెయ్యలేక పోవడమనేది ఉండదని అన్నారు."

లోక్‌సత్తా రాజకీయ పార్టీగా రూపొందిన ఈ 4 సంవత్సరాల కాలం నుండీ కూడా అదే లక్ష్యంతో వుండటమే గాక... "ఎక్కడైతే మహిళలు వివక్షతకి గురి కాకుండా వుంటారో, ఎప్పుడైతే మహిళలు ఎదిగే అవకాశాలకి దగ్గరౌతారో.. రాజకీయాల్లోకి మహిళలు వారసత్వంగా రాకుండా, స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదుగుతారో" ఆ దేశం మహిళా జాతికే ఆదర్శవంతంగా నిలుస్తుందని భావిస్తోంది. అందుకు తగినట్టుగానే తన పాత్ర పోషిస్తున్నది.

లోక్‌సత్తా పార్టీ విభాగమైన మహిళాసత్తా కూడా.. మహిళా సాధికారతను పెంపొందించే దిశగా అడుగులు వేస్తున్నది. ''ముదితల్ నేర్వగలేని విద్యగలదే''? అన్నట్లు మహిళలు చెయ్యలేని పని సాధించలేని విషయం అంటూ ఉండదు, అవకాశం వస్తే ఆకాశాన్నైనా అందుకోగలరు.

నిజంగా అదే జరిగింది. 2010, మార్చి 8వ తేదీన "నేలపైనే కాదు, నింగిలోనూ తమ దక్షతకు సాటిలేదు అన్నట్టు, భారత వనితలు మేఘాలపై అలవోకగా విమానాల్ని నడిపి చరిత్ర సృష్టించారు".. ఎయిర్ ఇండియా వారి 22 విమానాల్ని మహిళాపైలట్లు నడిపించి, తమ శక్తి సామర్థ్యాలను నిరూపించారు. ముంబాయి నుండి న్యూయార్క్‌కి బయలుదేరిన బోయింగ్ బి 777-200 ఎల్. ఆర్. విమానంలో మొత్తం సిబ్బంది మహిళలే కావడం విశేషం. కెప్టెన్ రష్మీ మిరండ, కెప్టెన్ సునీత నరూలా ఆ విమానానికి కమాండర్లుగా వ్యవహరించారు. అలాగే దేశవ్యాప్తంగా 136 మంది మహిళా పైలట్లు పలు అంతర్జాతీయ, సరుకురవాణా విమానాలని అనేక మార్గాల్లో విజయవంతంగా నడిపి, మహిళా దినోత్సవాన అరుదైన గౌరవాన్ని పొంది, గగనమార్గాన కూడా మహిళా సాధికారతను నిలబెట్టవచ్చని ఆ వనితలు నిరూపించారు!

**విధి నిర్వహణను మించిన దేశ సేవ లేదు -మహాత్మా గాంధీ**



కె. గీతామూర్తి

# జనహితమే పాలన లక్ష్యమైతే 'మద్యం' విధానం మారాలి

ప్రస్తుతం సామాన్య మధ్యతరగతి కుటుంబాలను అతలాకుతలం చేస్తున్న మౌలిక సమస్య మద్యం. సుమారు 70 లక్షల పైగా పేదకుటుంబాలు ఈ మహమ్మారితో తల్లడిల్లిపోతున్నాయి. మద్యాన్ని ఆదాయమార్గంగా ఎంచుకున్న పాలకుల వలనే ఈ పరిస్థితి దాపురించింది. టార్గెట్టు పెట్టి పాలకులే ఊరూరా మద్యం అమ్మిస్తున్నారు. దీంతో చట్టవిరుద్ధంగా ఊరూరా బెల్టుషాపుల జోరు పెరిగింది. రాజకీయాలకు, బెల్టుషాపులకు అవినాభావ సంబంధం వుంది. ఎన్నికల్లో ఓట్లకోసం నోటుతోపాటు భారీగా మద్యం అందించి ప్రజలకు తాగబోస్తున్నారు. వారిని మద్యానికి, బెల్టుషాపులకు బానిసలను చేస్తున్నారు.

ఒక్కసారి మద్యం మహమ్మారి చరిత్రను తెల్సుకుందాం. గతంలో అధికారంలో వున్న ప్రస్తుత ప్రధాన ప్రతిపక్షపార్టీ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేస్తానని అనగా, ఆ తర్వాత 2004లో అధికారంలోకి వచ్చిన ఇప్పటి అధికార పార్టీ హరితాంధ్రప్రదేశ్‌ని చేస్తానని అన్నాయి. కానీ ఈ రెండు పార్టీలు కలిసి చేసినవి మద్యాంధ్రప్రదేశ్‌ని అని చెప్పక తప్పదు. మన రాష్ట్రంలో దాదాపు 8500 వరకు లైసెన్స్‌వున్న వైన్‌షాపులు మరియు బార్లు వున్నాయి. ప్రజల ముంగిటకు పాలన చేరకపోయినా మద్యం చేరడానికి అనధికార, చట్టవిరుద్ధ బెల్టుషాపులు అనేవి వాహనాలుగామారాయి. ప్రస్తుతం రాష్ట్రంలో లక్షా 50వేల వరకు బెల్టుషాపులు పూర్తిగా పేదలు నివసించే ప్రాంతంలోనే వున్నాయి. దీనికితోడు నిషేధించబడిన సారా, గుడుంబాలు గ్రామాలను ముంచెత్తుతున్నాయి. మొత్తమ్మీద రాష్ట్రంలో మద్యం, నాటుసారా ఏరులై పారుతున్నాయి. ఈ పాలకుల పాపం వల్ల పేదలు, సామాన్య మధ్యతరగతి కుటుంబాలే బలవుతున్నాయి.

గత ప్రభుత్వం 1997లో మొదలు పెట్టిన మద్యం విత్తనాన్ని తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మహావటవృక్షంగా పెంచి పోషిస్తూ వస్తున్నాయి. 2004 వరకు అప్పటి ప్రభుత్వం ఏటా రూ॥4500 కోట్ల వరకు మద్యం ద్వారా ఆదాయాన్ని 25వేల బెల్టుషాపులను టార్గెట్ పెట్టి మరీ సంపాదించింది. 2005లో కాంగ్రెస్ పార్టీ రూ॥4500 కోట్లు ఏ పాటివి అని దాదాపు రూ॥15వేల కోట్ల ఆదాయాన్ని దగ్గరుండి మరీ టార్గెట్ పెట్టి తాగబోయించింది. ప్రజలందరు నాశనమైనా, ఆదాయంవస్తే చాలనుకునేరీతిలో రాష్ట్ర సర్కారు మత్తులో వుందనుకోవాలి. ఈ లక్ష్యాల్ని చేరేందుకు అనధికార బెల్టుషాపుల్ని ప్రభుత్వమే స్వయంగా ప్రోత్సహించటం దారుణ విషాదం.

ఆ రెండు పార్టీలు 'ఎన్నికల ముందు ఓడమల్లన్న, ఎన్నికలైన తర్వాత బోడిమల్లన్న' లాగా ప్రవర్తించాయనడంలో ఏ మాత్రం సందేహంలేదు. ఎన్నికల మేనిఫెస్టోలలో, మద్యాన్ని నిషేధిస్తాం. ప్రజల సంక్షేమాన్ని కాపాడుతామని వల్లెవేసిన పార్టీలు ఎన్నికలైన తర్వాత నిషేధిస్తే మాఫియా ఎదురవుతుంది, స్మగ్లింగులు చేస్తున్నారు, అనేక సమస్యలు వున్నాయని అంటున్నారు. అంటే అధికారంలోకి రాకముందు ఇవన్నీ గుర్తులేక హామీలిచ్చారని అనుకోవాలా? లేదా అవసరమైతే ఎలాంటి హామీలైనా ఇస్తారని అనుకోవచ్చా? పోని నిషేదం సాధ్యం కాలేదు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని ప్రజలారా క్షమించండి మేము నిషేధించలేకపోతున్నాము, కాని నియంత్రణలోకి తెస్తామని ఈ రెండు పార్టీలు అన్న పాపాన లేకపోగా మేము దగ్గరుండి తాగబోయిస్తాం. అడుగడుగునా టార్గెట్లు పెడ్తాం. ప్రజలే తాగుతున్న వారిని చైతన్యపరచాలి. మహిళలు, మహిళాసంఘాలు, స్వచ్ఛందసంస్థలు ఇదంతా వారిదే బాధ్యత అనడం ఎంత వరకు సబబు.

ఏ గ్రామానికి వెళ్ళినా తాగడానికి మంచినీటి వసతి, అనారోగ్యానికి చికిత్స చేసే ఆసుపత్రి, మందుల దుకాణాలు లేవు. మురుగు కాల్వల సంగతి లేదు. పాఠశాల వసతులు సరిగా లేవు. ప్రధాన అవసరాలు లేకపోగా ఈ మందు మద్యం ఖచ్చితముగా దొరుకుతుంది. రోజూవారి సంపాదనలో 80రూ॥ -100రూ॥ తాగడానికి పెట్టే ఆ కుటుంబాలు, అన్నమే తినాలో పిల్లల్ని చదివించాలో, కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఈ రోజు ప్రతి తాగేకుటుంబంలోని మహిళ, మాకు రెండు రూ॥ల బియ్యం వద్దు, పావలా వడ్డీ రుణాలు వద్దు, ఈ తాగుడు మాన్పించండి చాలని చాలాచోట్ల మహిళా సంఘాలకు తెల్పడం జరిగింది. ఒకవేళ ప్రభుత్వానికి ఆదాయమే ప్రధాన లక్ష్యం అయితే కనుక మేమందరం కలిసి బిచ్చమెత్తి అయినా ప్రభుత్వానికి ఇస్తాం కాని తాగుడు వద్దు, మీరన్నా చెప్పండి అంటున్నారు. ఒకవైపు మహిళల సంక్షేమం అంటున్న రాష్ట్ర సర్కారు ఈ మాటలకైనా మత్తు వదులుతాదో లేదో తాగుడుకు బలైన కుటుంబాలు చెప్పిన సంగతులు వింటే కంటనీరు రాకతప్పదు. తాగిన కుటుంబాలలో ప్రతి రాత్రి, ప్రతిదినం నరకమేనని తాగిన నిషాలో కొట్టడం, మాట్లాడలేని భాషలో తిట్టడం నిత్యకృత్యమేనని, పిల్లల ముందు ఏ రకంగానైనా ప్రవర్తించడం చేయడం వలన పిల్లలముందు తలెత్తుకోలేకపోతున్నామని, పిల్లలని

చదివించడానికి రూ॥ 50/- స్కూలు ఫీజుగాని, పుస్తకాలుగాని కొనడానికి డబ్బులు వుండవు కాని తాగడానికి డబ్బులు వుంటాయని, తాగిన నిషాలో అనాగరికంగా ప్రవరిస్తున్నారని, ఎదిగిన ఆడపిల్లలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడతారోనన్న భయంతో వారిని తాగని వారిళ్ళలో రాత్రిళ్లు తలదాచుకోమని పంపుతున్నామని, డబ్బులు ఇవ్వకపోతే ఏది దొరికితే అది తాగడానికి ఉద్దెర బెడ్తారని, ఆ నిషాలో చేతిలో ఏది వుంటే దాంతో దెబ్బలు తప్పవని, పిల్లలను నువ్వు తాగాల్సిందేనని, మద్యం కొనుక్కొనిరావాల్సిందేనని ఇవన్ని వింటుంటే ఇదంతా.... మద్యం కష్టాలు అని కళ్ళనీళ్ళు తెచ్చుకుంటే సరిపోదేమో అనిపిస్తోంది.



అసలు ఈ అలవాటు ఎలా మొదలవుతుంది. అన్నప్పుడు ఎన్నికల్లో పార్టీలు ఉచితంగా ఇవ్వడం వలన ఒక్కో పార్టీ కనీసం వారం, పదిరోజుల ముందు నుండి తాగినంత మద్యం ఇవ్వడంతో (ఒక పార్టీ 2 సీసాలైతే ఇంకోపార్టీ 4, ఇంకొకటి 6) ఇలా పెరుగుతున్న కొద్ది వాటిని ఏంచెయ్యాలో తెలియక ఒకసారి తాగిచూద్దామని, తాగిన తర్వాతదానికి అలవాటుపడి బానిసలయ్యే వారు ఎక్కువమంది వున్నారు. ఈ రోజు భారతదేశం గర్వించదగ్గ యువత దేశజనాభాలో 70% వున్న దేశం మనది. కాని మన రాష్ట్రంలో యువత మద్యం ప్రభావం వలన చెడుదిశగా వెళ్ళడం నిజంగా విషాదకరం. ధనరాజకీయాలు, అవినీతి రాజకీయాలను ప్రోత్సహిస్తున్న నాయకులు ఎన్నికలలో కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రలోభపెట్టడానికి దాన్ని అక్రమంగా సంపాదించడానికి అనుచరగణానికి చిన్న కుటీరపరిశ్రమల్లాగా ఈ అక్రమ మద్యం మాఫియాని సామాన్యమైన ప్రజలు ఎదుర్కొనే పరిస్థితి లేదు. దీంట్లో బడా నాయకుల చేయి వుండేసరికి వీరి జోలికి ఎవ్వరు వెళ్ళలేని పరిస్థితి. ఈ రోజు రాష్ట్ర సర్కారు నిద్ర "మత్తు"లో వున్నదనడానికి కారణం. ఒకవైపు ఆదాయం మార్గంకాగా ఇంకోవైపు ప్రధాన పార్టీల నాయకులు ఈ మద్యం వేలంపాటలో పాల్గొని లైసెన్స్ తీసుకొని అనధికారకంగా నడిపిస్తున్నవారు వుండడంతో ఎక్కడదొంగలు అక్కడ గప్‌చుప్ అయిపోయినారు. గత సం॥ నగర శివార్లలో కల్తీ మద్యంతాగి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించిన సంఘటన మరువకముందే ఈ రోజు కాకినాడ దగ్గర 15 మంది చనిపోయి 220 మంది అస్వస్థతకు గురై ఇంకా 10 మంది పరిస్థితి విషమంగా వుంది అనగానే మంత్రులు, అధికారులు, మీడియా అక్కడికి వెళ్ళి నాలుగురోజులు దాని గురించి మాట్లడడం తర్వాత మరచిపోవడం జరుగుతోంది. గతంలో "బెల్టుషాపులను తొలగించండి, ఆదాయాన్ని తగ్గించండి అని నిరసన తెల్పి, మెమొరాండం ఇవ్వడానికి వస్తారుకదా అక్కడికి వెళ్ళి సేవలందించడండి" అని అనడం జరిగింది. అంటే ఎక్సైజ్ మాత్రం పనిచేసి ప్రోహిబిషన్ పూర్తిగా మరిచినట్టు ప్రవర్తించినట్లే తెలుస్తుంది. గతంలో ఏర్పాటైన మద్యవిమోచన ప్రచారకమిటీ ఎక్కడ ప్రచారం చేసిందో, ఆ 10 కోట్ల బడ్జెట్ సంగతేంటో కనీసం రాష్ట్రంలో ఎక్కడన్న కన్పించిందో లేదో వారికే తెలియాలి. సరే ఇవ్వన్ని ఇప్పటి వరకు జరిగినా నిజంగా ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం మద్యాన్ని పూర్తిగా నిషేధించలేకపోయినా నియంత్రించి చైతన్యపరిచే దిశగా చర్యలు తీసుకొనే విధంగా గతంలో చెప్పినట్టే రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా నడుస్తున్న బెల్టుషాపులని పూర్తిగా తొలగించడం, గ్రామపంచాయితీలకు అక్కడ వైన్‌షాపు కావాలన్నా వద్దన్నా తీర్మానం చేసే విధంగా అధికారం ఇవ్వడం. తాగి వాహనాలు నడిపినా, బహిరంగంగా తాగినా కఠినశిక్ష విధించడం, డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయడం, చైతన్య కార్యక్రమాలు విరివిగా చేయడం, ప్రధాన రహదారుల పైన వుండే మద్యం దుకాణాలను తొలగించడం, మద్యాన్ని పూర్తిగా ప్రభుత్వ యంత్రాగంలో (రేషన్ షాపులాగా) ఏర్పాటు చేయడం, ఎన్నికలలో ఉచితంగా పంపిణి చేయబోమని పార్టీలు నిర్ణయం తీసుకోవడం వలన మద్యాన్ని నియంత్రించవచ్చు. ఇవన్నీ ఏర్పాటు చేస్తే ఏ సంక్షేమ పథకం పట్ల ఇవ్వని గౌరవం ఇస్తామని ఈ రాష్ట్రంలో మద్యంబారినపడిన కుటుంబాలు తెలియచేస్తున్నాయి. ఈ రాష్ట్ర సర్కారు అలోచిస్తుందా? ఏమో! రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు, మహిళలపట్ల హింసాత్మక దోరణికి మద్యం కారణం కాదా అని రాష్ట్ర సర్కారు ఆలోచించాలి మరి.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మన రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అయితే ఆ డబ్బులో చాలా భాగం నిరుపేదలు మద్యం దుకాణాలకు ధారపోస్తున్నారు. కుడిచేత్తో ఇచ్చి ఎడం చేత్తో దోచుకోవటమంటే ఇదే.

ప్రజల బాగోగులతో సంబంధం లేకుండా మద్యాన్ని ఎక్సైజ్ విభాగం కేవలం ఆదాయమార్గంగా చూస్తోందికాబట్టి మద్యం విధానాల రూపకల్పన, అమలును సమన్వయం చేసే అధికారాన్ని రాష్ట్రాలు ఆరోగ్య, శిశుసంక్షేమ శాఖకు అప్పచెప్పాలని భారత ప్రభుత్వం కేవలం సూచనలు చేసి చేతులు దులుపుకోకుండా వెంటనే ఆ దిశగా తప్పనిసరి ఆదేశాలు జారీ చేయాలి. మద్యం అమ్మకాల్ని నియంత్రిస్తే రాష్ట్ర ప్రభుత్వాలకు తగ్గే ఆదాయాన్ని భర్తీ చేయటానికి కూడా జాతీయ ప్రభుత్వం నిర్దిష్ట విధానంతో ముందుకు రావాలి.



డా॥ ఆలూరి విజయలక్ష్మి

# గ్రామీణ స్త్రీల పేదరికం

## కారణాలు - ప్రభావాలు - పరిష్కారాలు

***బ్రతకడానికి అవసరమైన కనీస అవకాశాలు లేకపోవడమే పేదరికం. డబ్బు, భూమి, 'అప్పులాంటి వనరుల లేమి' 'శక్తిలేమి' పేదరికంతో ముడిపడి వుంటుంది.***

## I గ్రామీణ స్త్రీల పేదరికానికి కారణాలు

### 1. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు

స్త్రీల పేదరికం నిర్మాణపరమైనది గ్రామీణ సంస్కృతి మహిళల్ని స్వతంత్రులుగా కాక ఆధీనులుగా, పురుషులకు లోబడి బ్రతికేవారుగా, సహనశీలురుగా బ్రతకాలని ఆశిస్తుంది. పితృస్వామిక కుటుంబవ్యవస్థ స్త్రీలు వారసత్వంగా తమ కుటుంబాల నుండి ఆస్థిపాస్తుల్ని పొందకుండా నిరోధించింది. పేదరికం వలన ఎక్కువగా నష్టపోతున్న స్త్రీలు తమ కమ్యూనిటీకి గ్రామానికి సంబంధించిన పేదరిక నిర్మూలనా పథకాలకు సంబంధించిన కార్యక్రమాలలో చైతన్యవంతమైన పాత్ర పోషించకుండా 'స్త్రీ పరిధి ఇల్లు' అనే భావన లింగ వివక్ష అడ్డుపడుతున్నాయి.

పురుషులు సంపాదించేవారు, స్త్రీలు ఆ సంపాదనతో బ్రతికేవారు అనే సంప్రదాయ భావన స్త్రీల శ్రమను, సంపాదనను తక్కువ చేస్తూ వారి పేదరికానికి కారణమవుతుంది.

### 2. నిరక్షరాస్యత

61.5 శాతం గ్రామీణ మహిళలు నిరక్షరాస్యులు, దళిత, ఆదివాసీ మహిళల్లో నిరక్షరాస్యత మరింత ఎక్కువగా వుంది. స్త్రీల చదువు విషయంలో వున్న సాంఘిక నియమాలు వారు చదువుకోకుండా, సామాజిక, ఆర్థిక స్వశక్తీకరణ పొందకుండా అడ్డుపడుతున్నాయి.

### 3. నైపుణ్యాల శిక్షణలు

విద్య, నైపుణ్యాల శిక్షణలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన, వేతనాలు, ఉపాధి తీరుతెన్నులలోని లింగ వివక్ష గ్రామీణ మహిళల్ని నిరుపేదలుగా మిగిల్చింది. లింగ సామాజికీకరణ స్త్రీలు పేదరికాన్ని సహజంగా భావించేలాగా, ఆమోదించేలాగా తయారుచేసింది.

### 4. సామాజిక దొంతరలు

కులవ్యవస్థ కూడా గ్రామీణస్త్రీల పేదరికాన్ని వృద్ధి చేస్తుంది. 69 శాతం మంది షెడ్యూల్డు కులాల మహిళలు, 31 శాతం మంది వెనుకబడిన కులాల మహిళలు ఉపాధి స్థిరత్వం లేని కారణంగా పేదరికం బారిన పడుతున్నారు.

### 5. వివాహస్థాయి

భర్త మరణించిన స్త్రీలు (21.6 శాతం) భర్తచే విడిచి పెట్టబడిన స్త్రీలు (18.3 శాతం) తీవ్రమైన పేదరికంతో జీవిస్తున్నారు. బాల్య వివాహాలు కూడా స్త్రీల పేదరికానికి ఒక కారణం. 64.7 శాతం బాలికలకు 18 ఏళ్ళ లోపే వివాహమవుతోందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఇంత చిన్న వయసు బాలికలకు తన సంపాదన మీద గాని, తమ భర్తల సంపాదనల మీద గాని నిర్ణయాత్మక పాత్ర వుండదు.

### 6. గ్రామీణ స్త్రీల పునరుత్పత్తి తీరు

కొడుకుకు ప్రాధాన్యం, గర్భనిరోధక సాధనాలను ఉపయోగించడం లో ఉన్న అపోహలు, అవగాహన లోపం గ్రామీణ స్త్రీల పునరుత్పత్తి తీరును ప్రభావితం చేస్తాయి. పునరుత్పత్తి వైద్యసేవల గురించి అవగాహన లేకపోవడం, తమ పునరుత్పత్తి ఆరోగ్యం గురించి స్వయంగా నిర్ణయించుకునే అధికారం లేకపోవడం, ఎక్కువ మంది పిల్లల్ని కనడానికి దోహదం చేస్తున్నాయి. దాదాపుగా 70శాతం మంది స్త్రీలు 3.4 మంది పిల్లల్ని కంటున్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉండడం పేదరికాన్ని ఇంకా ఎక్కువ చేస్తుంది.

### 7. ఆస్తులు, ఇతర వనరుల మీద యాజమాన్యహక్కులు లేకపోవడం

వనరుల మీద యాజమాన్య హక్కులు లేని గ్రామీణ స్త్రీలు పనిభద్రత, వేతన సమానత్వం లేని ఉపాధితో జీవనం సాగిస్తున్నారు. 80-85 శాతం వరకు గ్రామీణ స్త్రీలు వ్యవసాయకూలీలుగా, తాత్కాలిక శ్రామికులుగా పనిచేస్తూ చాలీచాలని సంపాదనతో బ్రతుకుతున్నారు.

### 8. కులవృత్తి

షెడ్యూల్డ్ కులం స్త్రీలలో 40-45 శాతం మంది స్త్రీలు తమ కుటుంబసభ్యులు కులవృత్తులలో ఉన్న కారణంగా పేదరికానికి గురవుతున్నారు. వారి కులవృత్తి సమాజంలో నీచమైనదిగా, తక్కువ విలువగలదిగా పరిగణింపబడడం వలన వారికి అతి తక్కువ వేతనం లభిస్తూ కుటుంబ కనీస అవసరాలను తీర్చలేనిదిగా వుంది.

**9. వ్యవసాయేతర రంగాలలో నైపుణ్యాలు లేకపోవడం**

గ్రామీణ స్త్రీలకు వ్యవసాయేతర రంగాలలో నైపుణ్యాలు లేకపోవడం వారిని వ్యవసాయం, వ్యవసాయాధారిత పనులకే పరిమితం చేస్తుంది. స్త్రీలు ఊరి బయటికి వెళ్ళి ఉపాధిని వెదుక్కోవడంపై ఉన్న సంప్రదాయక, సాంఘిక అదుపుకారణంగా కూడా వారు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాల్ని కల్పించని వ్యవసాయ రంగానికే పరిమితమయి పేదరికానికి ప్రతిరూపాలవుతున్నారు. వర్షపాతం మీద ఆధారపడే ప్రాంతాలలో సకాలంలో సరిపడా వర్షపాతం లేక వ్యవసాయరంగం మహిళల జీవనాన్ని, ప్రభావితం చేస్తుంది.

**10. స్త్రీల తక్కువస్థాయి**

కుటుంబంలోనూ, సమాజంలోనూ గ్రామీణ స్త్రీలకు వున్న తక్కువస్థాయి వారి విద్య, నైపుణ్యాల శిక్షణ, ఉపాధి అవకాశాల అన్వేషణపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పేదరికానికి దోహదం చేస్తోంది.

**11. వలసలు**

ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళే పురుషులలో చాలామందికి తగిన నైపుణ్యాలు లేక వారు సంపాదించిన డబ్బు తమను, తమ కుటుంబాన్ని పోషించడానికి సరిపోదు. పురుషులకు సరిపడా సంపాదన లేకపోవడం కుటుంబ భారాన్ని మోసే బాధ్యతను, కుటుంబపు నిత్యజీవితావసరాల్ని తీర్చే బాధ్యతను స్త్రీల మీద మోపుతోంది, పేదరిక భారాన్ని మోసేలా చేస్తుంది.

**12. పట్టణాల విస్తరణ**

పట్టణాలు విస్తరిస్తూ సమీప గ్రామాల్లోని పంటభూముల్ని వ్యాపార అవసరాలకు వినియోగించడం వలన వ్యవసాయం మీద ఆధారపడి బ్రతికేవారి ఉపాధి దెబ్బతింటుంది. ఇలా ఉపాధిని కోల్పోయిన స్త్రీలు భవన నిర్మాణ పనుల్లోనూ కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారాల్లోనూ ఉపాధిని వెదుక్కుంటున్నారు. వీటి ద్వారా వారు పొందే సంపాదన సరిపడా లేక పేదరికంతో బాధపడుతున్నారు.

**13. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు**

వ్యవసాయ వేతనాల్ని పెంచడం పరోక్షంగా గ్రామీణ స్త్రీల పేదరికాన్ని పెంచడానికి దారి తీస్తుంది. వేతనాలు పెరగడం వలన వ్యవసాయ ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వకుండా చాలా మంది రైతులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇది గ్రామాలలో నిరుద్యోగానికి, పేదరికానికి దారితీస్తూ మహిళలకు ఎక్కువ నష్టం కలిగిస్తుంది.

చిన్నకారు రైతులు, మధ్యస్థాయి రైతులు, కౌలుదారులు, రైతులు తమ కుటుంబ సభ్యులతోనే పని జరుపుకుంటూ బయటివారిని పనికి పెట్టుకోకపోవడం వల్ల స్త్రీలకు ఉపాధి కరువవుతుంది. సాంకేతిక ప్రగతి యంత్రాలతో పనిచెయ్యడానికి దోహదం చేస్తూ ఆ నైపుణ్యాలు లేని మహిళల ఉపాధి అవకాశాల్ని దెబ్బతీస్తుంది. ఇది గ్రామీణ మహిళల పేదరికాన్ని పటిష్టం చేస్తుంది.

**14. ధరల పెరుగుదల**

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వలన పేదలందరికీ బ్రతుకుభారంగా మారినప్పటికి గ్రామీణ ప్రజలకు, ముఖ్యంగా స్త్రీలకు బ్రతుకు గడవడం కష్టమవుతుంది.

**15. మద్యపాన వ్యసనం**

గ్రామీణ స్త్రీల పేదరికానికి ఇది ముఖ్యకారణం ప్రభుత్వాలు ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం దుకాణాల్ని తెరవడానికి అనుమతుల్ని ఇస్తున్నాయి. పురుషులు తమ సంపాదనలో 75 శాతాన్ని మద్యపానానికి వెచ్చిస్తున్నారు. ఇది స్త్రీలను తాము సంపాదించే కొద్దిపాటు డబ్బుతోనే సంసారాన్ని ఈదవలసిన పరిస్థితికి నెట్టుతుంది. దాదాపు 90 శాతం మంది పురుషులు ఈ వ్యసనానికి బానిసలయి స్త్రీల జీవితాల్ని దుర్భరం చేస్తున్నారు.

## II గ్రామీణ స్త్రీలపై పేదరికం ప్రభావాలు

**1. పౌష్టికాహార లోపం**

భారతదేశంలో ఆకలి, పేదరికంతో ప్రధానంగా పీడింపబడతుంది స్త్రీలే. భారతదేశ సంప్రదాయాలు స్త్రీలు జీవితాంతం తన తిండి గురించి తక్కువ శ్రద్ధ తీసుకునేలా, కుటుంబంలో అందరి కంటే ఆఖరున, అందరూ తినగా ఏది మిగిలితే అది తినేలా అలవాటు చేస్తాయి. తక్కువ తినడం వలన వారు పౌష్టికాహార లోపానికి, తద్వారా వచ్చే అనేక అనారోగ్యాలకు, అనర్థాలకు గురవుతున్నారు. గర్భిణీలకు ఇది మరింత నష్టాన్ని కలగజేస్తుంది.

**2. తక్కువ ఆరోగ్యసంరక్షణ**

స్త్రీలకు ఆరోగ్య అవగాహన, ప్రభుత్వపరంగా అందే ఆరోగ్యసేవల సమాచారం తక్కువగా ఉంటాయి. వారు తమ అనారోగ్యాల గురించి అలక్ష్యం చేస్తారు. వ్యాధి ముదిరాక గాని ఆరోగ్యసేవల్ని పొందరు. గ్రామీణ స్త్రీలు తమ ఆరోగ్య సంరక్షణను ఆఖరి ప్రాధాన్యంగా తలచడానికి ప్రధాన కారణం వారి పేదరికం.

**3. మితిమీరిన చాకిరి**

పేదరికంతో పోరాడుతూ అత్యధికశాతం స్త్రీలు వ్యవసాయ కూలీలుగానో, క్యాజువల్ శ్రామికులుగానో పురుషులకంటే దాదాపు రెట్టింపుగంటలు, ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేస్తూ కుటుంబాల్ని నడుపుతున్నారు.

**4. కుటుంబ సంఘర్షణలు**

దుర్భర దారిద్ర్యం కుటుంబసభ్యుల మధ్యపోట్లాటకు దారి తీస్తుంది. చాలా కుటుంబాలలో ఈ సంఘర్షణల వల్ల ఎక్కువ బాధపడేది స్త్రీలే. భర్త, అత్తమామలు, చివరకు తల్లిదండ్రులు కూడా పేదరికాన్ని భరించే క్రమంలో వచ్చే సమస్యలతో స్త్రీలను వేధిస్తారు. పేదరికం కారణంగా ఏర్పడు దుఃఖ వాతావరణం పిల్లల్ని, ముఖ్యంగా బాలికల్ని ప్రభావితం చేసి వారు చదువు

మానేయవలసిన పరిస్థితిని కల్పిస్తుంది, బాల కార్మికులుగా మారుస్తుంది. బడి మానేసిన బాలికలు రైతుల ఇళ్లల్లో పనిమనుషులుగానో, పొలం పనుల్లోనో, ఇతర పనుల్లోనో సంపాదించి కుటుంబ ఆదాయానికి తోడ్పడుతున్నారు.

### 5. వ్యభిచారం

కుటుంబ అవసరాల్ని తీర్చడం కోసం పేదరికం బారిన పడిన స్త్రీలు వ్యభిచారానికి పాల్పడుతున్నారు. ప్రమాదకరమైన అరక్షితలైంగిక ప్రవర్తన లైంగిక వ్యాధులకు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌కు దారితీస్తుంది.

### 6. దోపిడీ, అత్యాచారాలు

స్త్రీలపై అత్యాచారాలు, ఆందోళన కలిగించే స్థాయిలో జరుగుతున్నాయి. మానభంగాలు, రకరకాల వేధింపులు, భౌతిక, మానసిక, లైంగికదాడులు, వేతనాలలో వివక్ష, దోపిడీ మొదలైనవి మానవహక్కుల ఉల్లంఘన స్థాయిలో ఉన్నప్పటికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని, బ్రతుకుదెరువును కోల్పోతామేమోననే భయంతో, భూస్వాములు, అగ్రవర్ణాల వారు వెలివేసి వేధిస్తారేమోననేభీతితో పేదస్త్రీలు పెదవి విప్పకుండా భరిస్తున్నారు.

## III పేదరికం నుండి విముక్తికి పరిష్కారాలు

- 'మహిళలు కేంద్రంగా కార్యాచరణ' పథకాన్ని గ్రామాలలో అమలు చెయ్యాలి.
- నిరక్షరాస్యతానిర్మూలన, వ్యవసాయేతర రంగాలలో శిక్షణలు వారు తమ ఇంటిబయట, గ్రామం బయట ఉపాధిని పొందటానికి సహాయపడతాయి.
- స్త్రీల స్వయంసహాయకసంఘాలు సూక్ష్మరుణ కార్యకలాపాల నుండి వ్యాపార కార్యక్రమాలకు ఊర్ధ్వచలనం పొందాలి.
- పునరుత్పత్తి ఆరోగ్యం గురించి, పునరుత్పత్తి హక్కుల గురించి అవగాహన వలన తాము ఎంత మంది పిల్లల్ని, ఎప్పుడు కనాలో నిర్ణయించుకోగలుగుతారు అందుబాటులో ఉన్న పరిమిత వనరుల్ని ప్రాధాన్యతాక్రమంలో మెరుగ్గా వినియోగించ గలుగుతారు.
- గ్రామీణ స్త్రీలు నాయకత్వ లక్షణాల్ని పెంపొందించుకోవాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని ధైర్యంగా ప్రభావితం చెయ్యడం ద్వారా తమ సమస్యల్ని కొంతవరకు పరిష్కరించుకోగలుగుతారు.
- గ్రామాలలోని వనరుల్ని గ్రామీణ శ్రామిక శక్తికి ఉపాధిని కల్పించే విధంగా వినియోగించాలి.
- స్త్రీల సశక్తీకరణ గ్రామీణస్త్రీల దారిద్ర్యనిర్మూలనకు కేంద్రబిందువు కావాలి. సశక్తీకరణ వారి ఆర్థిక, సాంఘిక స్థాయిని పెంచుతుంది.
- స్త్రీలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను వారు విస్తృతంగా వినియోగించుకునేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తే, వాటి లబ్ధిని వారు సంపూర్ణంగా పొందగలుగుతారు.
- అన్ని స్థాయిలలోనూ స్త్రీలకు సమాన విద్యావకాశాల్ని కల్పించడం, వారి సామర్థ్యాన్ని పెంపొందించడం, వారి పట్ల అమలవుతున్న అన్ని రకాల వివక్షల్ని నిర్మూలించడం, స్త్రీలపై హింసను అంతమొందించడం స్త్రీల పేదరిక నిర్మూలనకు తప్పనిసరి అంశాలు.

పేదరికం మౌలిక మానవహక్కుల ఉల్లంఘన, మానవ గౌరవానికి, మర్యాదకు భంగం కలిగించే అంశ. ఏ అభివృద్ధి ప్రక్రియకైనా తప్పనిసరి అయినది సక్రమంగా మానవహక్కుల్ని అనుభవించడం.

పేదరికం వ్యక్తిగతమైనది కాదు, వ్యవస్థాపరమైనది. అందుచేత వ్యవస్థాపరమైన సమిష్టిప్రయత్నం, సమిష్టిమార్గం మాత్రమే పేదరికాన్ని తొలగించగలదు. ❁

# అంతర్జాతీయ మహిళాదినోత్సవం

**నిజామాబాద్**



లోక్‌సత్తా మహిళా విభాగం మహిళాసత్తా నిజామాబాద్ అధ్యక్షురాలు శ్రీమతి ఎ.కె. లత ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగిన నూరవ అంతర్జాతీయ మహిళాదినోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయులు రాణిఅంబయ్య, మెర్సిరత్నాబాయి మరియు హెల్త్ సూపర్‌వైజర్ జీవకిరీటం మాట్లాడుతూ హోంమినిస్టరుగా స్త్రీ వున్నా కూడా వరకట్న దురాచారాలు, మహిళలపై అరాచకాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని మహిళలకు రక్షణ కల్పించే చట్టాలు పూర్తిగా అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమౌతోందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాతెలంగాణా పార్టీ పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నెహ్రూ యువక కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ విద్యాసాగర్, అంబేద్కర్ యువజన సమితి అధ్యక్షుడు పరీక్షిన్‌రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్. మహాలక్ష్మి

# ఆరోగ్యమే మహాభాగ్యం అందరికి అందుబాటులో వైద్యం

స్వాతంత్ర్యానంతరం మనం ఏర్పాటు చేసుకున్న వైద్య వ్యవస్థ అందరి మన్ననలనూ పొందినదనే చెప్పాలి. అప్పటి ప్రభుత్వాలు వైద్యపరంగా చేసిన కృషి వైద్యవ్యవస్థను పటిష్టంగా ప్రవేశపెట్టడానికి ఎంతగానో ఉపకరించింది. రాష్ట్రవ్యాప్తంగా మనకు వైద్యకళాశాలలు వాటికి అనుసంధానంగా, ప్రభుత్వాసుపత్రులు ఎంతోపేరు ప్రతిష్టలు సంపాదించాయి. రాను రాను అభివృద్ధి చెందవలసిన ప్రభుత్వ వైద్య విధానాలు నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్న చందంగా తయారయ్యాయి. ప్రైవేటు కళాశాలలు ఆసుపత్రులు పెరిగి పెరిగి ఐదు నక్షత్రాల ఆసుపత్రులుగా రూపాంతరాలు చెందాయి. పేదలకు వైద్యం అందని ద్రాక్షపండు చందంగా తయారయ్యింది. అభివృద్ధి చెందుతున్న వైద్య విధానాలను ప్రైవేటుపరం చేస్తూ ప్రభుత్వ వైద్యరంగాన్ని ప్రభుత్వపరంగా నిర్వీర్యం చేస్తున్నదని చెప్పవచ్చు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవలసిన బాధ్యత ప్రభుత్వానిది. అయితే నేడు ప్రభుత్వాసుపత్రులలో జరుగుతున్న ఘోరాలు వాటిని నరక కూపాలను తలపిస్తున్నాయి. గర్భిణీస్త్రీల ప్రసవాలకు, పసికందుల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయింది. పైగా ఈ విషయాలను ఆసుపత్రి వర్గాలు చాలా మామూలు వ్యవహారంగా భావించటం, వారి నిర్లక్ష్య ధోరణికి పరాకాష్ట. వైద్యుల నిర్లక్ష్యం సిబ్బంది లంచగొండితనం కోరలు చాచి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. పల్లె పల్లెలలో వైద్యసేవలు మెరుగుపరచవలసిన ప్రభుత్వం పేదవారి, పల్లెలోని ప్రజల యొక్క ఆరోగ్యం విషయంలో శీతకన్ను వేసిందనే చెప్పాలి. 'ఆరోగ్యశ్రీ' విధానాన్ని మెరుగుపరచి ప్రజలందరి ఆరోగ్యశ్రీకార్డులు అందజేసి వైద్యులకు వారి సేవలను బట్టి పారితోషికం ప్రభుత్వమే అందజేస్తే అందరికి మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుంది అన్నమాట వాస్తవం.

భారతదేశ వైద్య విధానాలలో ఆయుర్వేదం అతి ప్రాచీనమైనది. వంటింట్లో పోపుల పెట్టె నుండి పెరటిలో తులసిమొక్క, అడవిలో పిచ్చిమొక్కల వరకు వైద్యానికి పనికివచ్చేవిగా, మన పూర్వులు ఏనాడో గ్రహించారు. ఆచారపరంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సాంప్రదాయబద్ధం చేశారు. అటువంటి మన ఆయుర్వేద వైద్య విధానాన్ని పాశ్చాత్యదేశాలు గుర్తించి ప్రయోగాత్మకంగా శోధించి అనుసరిస్తున్నాయి.

కొత్త కొత్త రోగాలు, జ్వరాలు పంజావిసురుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలలో ఈ మధ్య పేరులేని జ్వరాలు ప్రబలినప్పుడు అక్కడి ప్రజలు ఎంతటి నిర్లక్ష్యానికి గురయ్యారో చెప్పలేము.



తాజాగా చికున్‌గున్యా, డెంగ్యు, స్వైన్‌ఫ్లూ జ్వరాలు పట్టణాలను సైతం వణికించాయి. దూరదూరాల నుండి హైదరాబాదు నగరానికి వస్తేనే కాని సరియైన వైద్యం అందని పరిస్థితి. ఈ ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి పదికిలో మీటర్లలోపు మెరుగైన వైద్యసేవలకి పరీక్షలు, పడకలు పూర్తిస్థాయి వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. ప్రైమరీ హెల్త్‌సెంటర్లను మెరుగుపరచగలగాలి.

ఆయుర్వేదం, మూలికావైద్యం, హోమియోవైద్యం, అలాగే మిగతా ఉపయోగకరమైన వైద్యవిధానాలను కూడా సరళీతరం చేసి ప్రజలకు చేరువగా తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేగలగాలి.

ఇదిలాఉంటే ప్రభుత్వాసుపత్రులలో జరిగే అకృత్యాలు, వైద్యులు, సిబ్బంది యొక్క నీతిలేని తనాన్ని కళ్ళకు కడుతున్నాయి. ప్రభుత్వ క్రొత్త విధానాలు ప్రవేశపెట్టే ముందు వైద్యవ్యవస్థను అమూలాగ్రం ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతోఉంది. లేకుంటే మెరుగైన వైద్యవిధానాలు ఎన్ని ప్రవేశపెట్టినా ఫలితం ఉండదు. అంతేకాక పల్లెలోనైనా, పట్టణాలలోనైనా ప్రజలకు ముందుగా పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించకుంటే రోగాల విజృంభణ తగ్గదు. పోలియోపరంగా సాధించిన మంచి ఫలితాన్ని మనం తప్పక అంగీకరించాలి. అయితే మిగతా క్షయ, మలేరియా, మశూచి, కలరా, టైఫాయిడ్ అఖరికి ప్లేగు, నేనున్నానంటూ పంజా విసురుతూనే ఉన్నాయి. ఎం.ఎం. అదే టీకాలు నిర్భంధంగా వేసే ఏర్పాటు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

వైద్య ఆరోగ్య సదస్సుల ద్వారా పల్లెలలో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించగలగాలి. దీనికై ప్రసారమాధ్యమాలను ఉపయోగించుకుంటే పల్లెపల్లెకు విస్తరించే అవకాశం ఎంతైనా ఉంది.



యస్.వి. గజానని

# మహిళాబిల్లు

***మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రత్యామ్నాయంగా రాజ్యాంగసవరణతో సంబంధం లేకుండా మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెంపొందించేందుకు లోక్‌సత్తా ఉద్యమం కొన్నేళ్ల క్రితం రూపొందించిన ముసాయిదా బిల్లు గురించి, దాన్ని, లోక్‌సత్తా పార్టీ అమలు చేస్తున్న తీరు గురించి డా॥ జయప్రకాష్ నారాయణ్ సవివరంగా తెలియచేశారు.***

భారతావని భావిగతిరీతుల్ని గుణాత్మకంగా ప్రభావితం చేసే మహిళా రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభతో పాటు అసెంబ్లీల్లోనూ ఆమోదించి మహిళలకు మూడోవంతు స్థానాలను ప్రత్యేకించే చట్టాన్ని అమలు చేయాలి. మహిళా సాధికారత లక్ష్యాన్ని సాధించాలంటే - స్త్రీలకు సమాన అవకాశాలు వారి ఎదుగుదలకు అనువైన వాతావరణం కల్పించాలి.

మహిళా రిజర్వేషన్ల బిల్లు చట్టమైతే తమ పదవీపీఠాలు కదిలిపోతాయన్న భయందోళనలు ఎందరినో బాధిస్తున్నాయి. మహిళలకు చట్టసభలందు భాగస్వామ్యం కల్పించినపుడే సమసమాజ అభ్యున్నతి తర్వితంగా సాధ్యపడుతుంది. దేశ చరిత్రలోనే గొప్ప సుదినమంటూ 1996 సెప్టెంబరులో శ్రీ దేవెగౌడ తొలిసారి మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రతిపాదించినప్పుడు అన్ని పార్టీలు హర్షంగా స్వాగతించాయి. భారత రాజకీయంలో స్వరూప స్వభావాల్నే మార్చేసేటంత ప్రభావశీలత ఆ చట్టానికి ఉందన్న స్పృహ కలిగిన మరుక్షణం నుంచే కొన్ని పార్టీల ధోరణి మారిపోయింది. మాటల్లో మహిళా సాధికారత మోతెక్కిపోతున్నా కనీసం నలభైకి పైగా చట్టాలు స్త్రీ హక్కులన్ని తొక్కి పట్టేలా ఉన్నాయని 2007 కేంద్ర మంత్రిత్వశాఖ అధ్యయనమే ఎలుగెత్తి చాటింది.

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం వారి సాధికారతకు ఒక సహేతుక కొలమానం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమన్న భుజకీర్తులు తగిలించుకొనే ఇండియాలో స్త్రీల ప్రాతినిధ్యం 11.25% దాటకపోవడం దురదృష్టకరం. చట్టసభల్లో మహిళాసభ్యులు అధికంగా ఉన్న 20 దేశాల్లో 17 చోట్ల ఏదో ఒక రూపంలో రిజర్వేషన్లు ఉన్నాయని యునిసెఫ్ లోగడ వెల్లడించింది. చారిత్రాత్మక చట్టం తెచ్చిన ఘనత అన్ని పార్టీలనీ పరస్పరం భుజాలు చరుచుకోగానే సరికాదు. ఆయా పార్టీల వ్యవస్థాగత నిర్మాణంలోనూ అందుకు దీటైన సంస్కరణలు రావాలి. నేటి రాజకీయ యవనికను చూస్తే, ఉన్న కొద్ది మంది మహిళా సభ్యులు వారి బలీయ కుటుంబ నేపథ్యం దన్నుతోనే ఉన్నతాసనాలను అధిరోహించారని చెప్పక తప్పదు. స్త్రీల ప్రాతినిధ్యం ఇనుమడిస్తే రాజకీయ రంగ ప్రక్షాళన జరుగుతుంది. మహిళా బిల్లు రాజకీయ వ్యవస్థలోని చెడుగుల్ని పరిమార్చేటంత మహిమాన్వితం కావాలంటే పార్టీల అంతర్గత వ్యవస్థల ఆలోచనా ధోరణుల్లో తప్పక గుణాత్మక మార్పు రావాలి.

మహిళల పట్ల రాజకీయ పార్టీలకు తప్ప ఓటర్లకు ఎటువంటి వివక్ష లేదు. పురుషాధిక్యతను కొనసాగించేందుకే సంప్రదాయ రాజకీయ పార్టీలు మహిళలకు రిజర్వేషన్లు కల్పించకుండా అడ్డుకుంటున్నాయి. 1984 నుంచి జరిగిన ఎన్నికల ఫలితాల్ని చూస్తే పార్టీల అభ్యర్థుల్లో పురుషులు 26 శాతం మాత్రమే ఎన్నిక కాగా, మహిళలు 33 శాతం విజేతలయ్యారు. అయినా పురుషాహంకారంతో మహిళల్ని అణగదొక్కుతున్నారు. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి నోచుకోవడం లేదు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు ఉద్దేశించిన బిల్లు గత 14 సం॥ లుగా పెండింగ్‌లో ఉండటం ఆయా పార్టీల కపటత్వానికి, దోపిడీ స్వభావానికీ నిదర్శనం. మహిళలకు దక్కాల్సిన స్థానాన్ని ఇవ్వకుండా అడ్డుకోవటంలో నేతలంతా కూడబలుక్కుని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చట్టసభలకు జరిగే ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లను పార్టీలు స్వచ్ఛందంగా కేటాయించటానికి రాజ్యాంగంలోని ఏ ప్రకరణం అడ్డం కాదు. కానీ రాజ్యాంగ సవరణ లేకుండా అది సాధ్యం కాదన్నట్టు పార్టీలు నాటకమాడుతున్నాయి.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రత్యామ్నాయంగా రాజ్యాంగసవరణతో సంబంధం లేకుండా మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెంపొందించేందుకు లోక్‌సత్తా ఉద్యమం కొన్నేళ్ల క్రితం రూపొందించిన ముసాయిదా బిల్లు గురించి, దాన్ని, లోక్‌సత్తా పార్టీ అమలు చేస్తున్న తీరు గురించి డా॥ జయప్రకాష్ నారాయణ్ సవివరంగా తెలియచేశారు.

మహిళలకు ప్రత్యేకంగా నియోజకవర్గాల కేటాయింపు కోసం రాజ్యాంగ సవరణ చేయటం కొంత క్లిష్టమైన ప్రక్రియ. తమ నియోజకవర్గాలను కోల్పోతామనే భయంతో ప్రతి పదేళ్లకీ జరగాల్సిన నియోజకవర్గాల పునర్విభజనను కూడా వ్యతిరేకించే పార్టీల అభ్యర్థులు, మహిళలకు సీట్లు ప్రత్యేకించి కేటాయిస్తామంటే తమ సీట్లు పోతాయనే భయంతో ఇంకా తీవ్రంగా వ్యతిరేకిస్తారు.

సీట్ల రిజర్వేషన్ల రొటేషన్ వల్ల తమ నియోజకవర్గాలలో సీటు దక్కదని ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తారు. స్థానిక ప్రభుత్వాల ఎన్నికలలో చేసినట్టు మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు పెద్ద సంఖ్యలో సీట్లను రిజర్వు చేసిన రొటేషన్ పద్ధతిని అమలు చేస్తే, నాయకత్వం లాటరీ లాగా నిర్ణయమవుతుంది తప్ప సహజ నాయకత్వానికి అవకాశం ఉండదు. చాలా సందర్భాలలో బడానేతల భార్యలు, కూతుళ్లు లేదా కోడళ్లు ఉత్సవ విగ్రహంగా నాయకత్వ స్థానాల్లోకి వస్తుంటారు. తిరిగి అవకాశం లభించగానే పురుషనేతలు ఆ స్థానాన్ని కైవశం చేసుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళా సాధికారత నామమాత్రమే అవుతుంది. ఈ రకమైన నాయకత్వ వైఫల్యం పంచాయితీలు, మున్సిపాలిటీలలో ఇప్పటికీ చాలా ఎక్కువగా కనిపిస్తోంది.

ఈ నమూనాబిల్లు ప్రకారం ప్రతి రాజకీయ పార్టీ చట్టసభల్లో మూడోవంతు సీట్లను మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. ఏయే మహిళలకు నిలబెట్టాలో అది పార్టీ నిర్ణయం. అయితే బలహీనంగా ఉండే నియోజకవర్గాలు మహిళలకు కేటాయించకుండా ఈ ప్రత్యామ్నాయంలో మూడు పార్లమెంటరీ నియోజకవర్గాల సముదాయాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రతి సముదాయంలో మూడోవంతు అసెంబ్లీ స్థానాల్లో, అంటే మన రాష్ట్రంలో ప్రతి 21 అసెంబ్లీ సీట్లలో ఏడుగురు మహిళల్ని ప్రతి పార్టీ నిలబెట్ట వలసి వస్తుంది. తక్కువ మంది మహిళల్ని నిలబెడితే, పురుష అభ్యర్థుల స్థానాల్ని కోల్పోవలసి వస్తుంది. ప్రతి మహిళా అభ్యర్థికి ఇద్దరు పురుష అభ్యర్థుల్ని వదులుకోవలసి వస్తుందని జేపీ పేర్కొన్నారు.

ఇలాంటి ఏర్పాటులో స్థానిక రాజకీయ పరిస్థితులను బట్టి మహిళా అభ్యర్థులను ఎంచుకునే స్వేచ్ఛ రాజకీయ పార్టీలకు ఉన్నప్పుడు ఒ.బి.సి.లకు, మైనారిటీలకు ఉప రిజర్వేషన్లు కేటాయించాలనే సమస్య దానంతటదే పరిష్కారమవుతుంది. ప్రతి పార్టీ స్థానిక రాజకీయ సామాజిక పరిస్థితులను బట్టి మహిళలలో బి.సిలను మైనారిటీలను తాము కోరుకున్న చోట పోటీకి దింపటం సాధ్యమవుతుంది.

ఇటీవల జరిగిన ఐదురాష్ట్రాల ఎన్నికల్లో మహిళలు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం, అలాగే మహిళా అభ్యర్థులు కూడా గణనీయ సంఖ్యలో ఎన్నికవటం, భారత రాజకీయాల్లో సానుకూల పరిణామం, పెద్దమార్పునకు దోహదం చేసే అంశం.

మహిళల పట్ల వివక్షకు కులం లేదు, మతం లేదు, వర్గం లేదు, ప్రాంతం లేదు. ఆడపిల్ల కడుపున పడిననాడే వివక్ష మొదలవుతుంది. చదువులో, ఆరోగ్యంలో, రోజువారీ జీవితంలో ఈ వివక్ష వేళ్లానుకుంది. ప్రపంచీకరణలో లింగ వివక్ష తగ్గిందని, మహిళలు అన్ని రంగాలలో మగవారితో సమానంగా పోటీ పడుతున్నారని కొందరు పెద్దలు చెబుతున్న మాటలు కేవలం చెప్పుకోవటానికే, వాస్తవంలో పరిస్థితి అంత ప్రోత్సాహకరంగా లేదని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యు.ఈ.ఎఫ్) తాజా నివేదిక పేర్కొంది. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, రాజకీయాలు ఏ రంగమైనా పురుషులకు ఎన్నో అడుగుల దూరంలో మహిళలు ఉన్నారని స్పష్టం చేసింది. స్వీడన్ మినహాయిస్తే అన్ని దేశాల్లో అదే పరిస్థితి. ముస్లిం దేశాల్లో పరిస్థితి మరి దయనీయం. గత సంవత్సరం నివేదికలో 98వ స్థానంలో ఉన్న భారత్ ఈ ఏడాది మరింత దిగజారి114వ స్థానంకి చేరింది.

మన దేశంలో పాఠశాలలో బాత్‌రూమ్స్ లేకపోవడంతో, సహ ఆడపిల్లల చదువుకు అన్నీ ఆటంకాలే. కనీస వసతులు లేని పాఠశాలలు ఆడపిల్లల చదువుకు శాపంగా మారుతున్నాయి. అన్నింటినీ అధిగమించి చదువు కొనసాగిస్తుంటే, రకరకాల వికృత ప్రవర్తనలు, వేధింపులు, ఈ ప్రతిబంధకాలను కూడా తట్టుకుని కష్టపడి చదువుదామనుకుంటే ఆర్థిక పరిస్థితి అనుకూలించని వారు ఎందరో? ఇక ఎలాగోలా చదువులో గట్టెక్కి గుర్తింపు పత్రం తీసుకున్నా, తగిన నైపుణ్యం లేక ఉపాధి అవకాశాలు దొరకటం లేదు. నైపుణ్యాలు పెంచుకోటానికి, వచ్చిన ఉద్యోగం చేయడానికి చాలా తక్కువమంది మహిళలకు మాత్రమే అవకాశాలు ఉంటున్నాయి. ఇలా పుట్టినప్పటి నుంచి గ్రామస్థాయి నుంచి స్త్రీలు వివక్షకు అణచివేతకు గురవుతున్నారు.

ఈ సమస్యలన్నిటి నుంచి మహిళలకు శాశ్వత విముక్తి కలిగించేందుకు కేవలం నైతికప్రచారం, సలహాలు, పథకాలు, స్వల్ప వడ్డీ రుణసౌకర్యాలు సరిపోవు. రాజకీయ వ్యవస్థలో వారు భాగస్వాములై, నిర్ణయాధికారులుగా మారితేనే సమూల మార్పు మొదలవుతుంది. మన రాజకీయ వ్యవస్థలో ఇంకా సంప్రదాయ ధోరణే కొనసాగుతోంది. మహిళల సమస్యలకు పరిష్కారంగా కాకపోయినా, కొంతకాలం పరిహారంగానైనా రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వటానికి వాళ్లు ససేమిరా అంటున్నారు. ఓట్లు దండుకోవడం కోసం మాత్రం ఇదిగో ఇస్తున్నాం, అదిగో ఇస్తున్నాం అంటూ కొన్నేళ్లుగా తాత్సారం చేస్తున్నారు. రిజర్వేషన్‌లో రిజర్వేషన్ కావాలని కొందరు, 33 శాతం మరీ ఎక్కువని 20% చాలని కొందరు మోకాలడ్డుతున్నారు. పార్లమెంటులో మహిళలకు మూడోవంతు సీట్లను కేటాయించటానికి మొత్తం సీట్లను 725కి పెంచాలని కొంతమంది మరో ప్రతిపాదన చేస్తున్నారు. మొత్తం మీద ప్రస్తుతం పార్లమెంటులో మహిళాసభ్యుల సంఖ్య 8% మాత్రమే ఉంది. అంటే సగభాగానికి 42% తక్కువ. చట్టసభల్లో మహిళలకు మూడోవంతు ప్రాతినిధ్యం కల్పించేందుకు యూపిఏ ప్రభుత్వం సంకల్పించడాన్ని లోక్‌సత్తా పార్టీ స్వాగతించింది. అయితే ఇందుకోసం తలపెట్టిన మహిళా రిజర్వేషన్ తీవ్ర లోపభూయిష్టమైనది. దీన్ని యధాతథంగా ఆమోదించటం కృత్రిమంగా ఉంటుంది తప్ప మహిళలకు ఏ మాత్రం ప్రయోజనం వుండదు. అందులో లొసుగుల్ని సరిచేసుకోవాల్సి

ఉంది. మహిళా రిజర్వేషన్ కోసం లోక్‌సత్తా ప్రత్యామ్నాయ బిల్లును రూపొందించింది. దీని ఆధారంగా ప్రస్తుత బిల్లులో సవరణలు చేసి అమలు చేస్తే మహిళలకు నిజమైన ప్రాతినిధ్యం లభిస్తుంది. ఈ నమూనా బిల్లుకు ఎన్నికల సంఘం కూడా సానుకూలంగా స్పందించి ఆమోదించాలని పార్టీలకు సూచించింది. ఎటువంటి రాజ్యాంగ సవరణ లేకుండా కేవలం చట్ట సవరణతో ఈ బిల్లును తక్షణం అమల్లోకి తేవచ్చు. మహిళా అభ్యర్థులకు అవకాశమిస్తే గెలవరని తప్పుడు ప్రచారం చేస్తూ టికెట్లు ఇవ్వడానికి సంప్రదాయ పార్టీలు నిరాకరిస్తున్నాయి. కానీ మహిళల గెలుపు పట్ల పార్టీలు తప్ప ఓటర్లు వ్యతిరేకం కాదని గణాంకాలు సూచిస్తున్నాయి. రాజకీయ సంస్కృతిని జుగుప్సాకరంగా, అగౌరవ కార్యక్రమాలుగా మార్చి మహిళలు ప్రవేశించకుండా ఆ పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటం మహిళాసాధికారత పట్ల రాజకీయ పార్టీల నిర్లక్ష్యానికి నిదర్శనం. అసలు బిల్లుతో ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పార్టీలే మూడోవంతు టికెట్లు ఇచ్చే అవకాశమున్నా ఒక లోక్‌సత్తా మినహా ఎవరూ ఎందుకు అందుకోసం బహిరంగ ప్రకటన చేయలేదు.

1996లో ప్రతిపాదించిన మహిళాబిల్లును ఇపుడు యథాతదంగా ఆమోదించినా కూడా పేరుకే తప్ప మహిళలకు అధికారం రాదు. వారు సమానహక్కుల్ని పొందే వారుగా కాకుండా వివక్షకు గురై అదనపు సదుపాయాన్ని పొందుతున్న ఓ ప్రత్యేక వర్గంగానే మిగిలిపోతారు.

ఈ బిల్లు అమల్లోకి వస్తే లోక్‌సభలో మూడోవంతు అంటే దాదాపు 181 సీట్లు మహిళలకు కేటాయించాల్సి వస్తుంది. అది కూడా ప్రతి సాధారణ ఎన్నికలో రొటేషన్ పద్ధతి కావడంతో ఏ ఒక్క నియోజకవర్గం నుంచి ఓ అభ్యర్థి వరుసగా పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. సిట్టింగ్ అభ్యర్థుల్లో మూడింట రెండొంతుల మంది సాధారణ ఎన్నికల్లో బలవంతంగా తమసీటును ఖాళీ చేయాల్సి వస్తుంది. ఒక పురుష అభ్యర్థికి ఈ పరిస్థితి వస్తే, అక్కడ మహిళా అభ్యర్థిగా తన కుటుంబ సభ్యులనే నిలబెడతాడు. ఇది ప్రజాస్వామిక ప్రాతినిధ్య విధానాన్నే దెబ్బతీస్తుంది. ప్రజాప్రతినిధి ఓ నియోజకవర్గాన్ని ఎంచుకుని అక్కడ కార్యక్రమాలు చేపట్టే అవకాశాలుండవు. మరోసారి అదే నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యే అవకాశం లేదని తెలిశాక, రాజకీయాలు మరింత ఉదాసీనంగా, బాధ్యతారహితంగా మారిపోతాయి. ఒకవేళ మహిళా అభ్యర్థే అక్కడే జనరల్ అభ్యర్థిగా పోటీ చేయాలంటే మొత్తం సీట్లన్నీ మహిళలే ఉండే పరిస్థితి వస్తుంది.

పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు రిజర్వేషన్లను 33 శాతం నుంచి 50 శాతానికి పెంచుతూ జాతీయ ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వేషన్ల వల్ల మహిళా సాధికారత సాధ్యంకాదు. రొటేషన్ పద్ధతి అమలులో ఉండలం వల్ల నాయకత్వం ఎదిగే అవకాశాలు తగ్గిపోతాయి. స్థానిక ప్రభుత్వాల్లో పోటీచేసే అభ్యర్థులు వేరే స్థానాన్ని ఎంపిక చేసుకుని పోటీ చేసే అవకాశాలు దాదాపు ఉండవు.

అంతిమంగా రాజకీయం మారితేనే రిజర్వేషన్ల వల్ల ఫలితం. అయితే మహిళలకురిజర్వేషన్లను కల్పించడమే సర్వరోగ నివారిణి కాదు. స్థానిక ప్రభుత్వాల్లో మహిళా రిజర్వేషన్లను చూస్తే ఈ వాస్తవం అర్థమవుతుంది. స్థానిక ప్రభుత్వాల్లో మూడోవంతు మహిళలు ఎన్నికవుతున్నా వారి పరిస్థితిలో పెద్ద మార్పేమి లేదు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు కేటాయించకుండా ఉంటే మహిళలకు సాధికారత ఎలా లభిస్తుంది? ఈ రోజు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిలో కేవలం రిజర్వేషన్ పెంపు మహిళల సాధికారతకు, నిజమైన మార్పునకు దోహదం చేయదు. మధ్యలో ఏ రాజకీయ జోక్యం లేకుండా స్థానిక సంస్థలకు నేరుగా నిధుల్ని అందచేయాలని, వారి జీవితాల్ని వారే బాగు చేసుకునే విధంగా బేషరతుగా నిధుల్ని విడుదల చేయాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నా రిజర్వు బ్యాంకు స్వయంగా సిఫార్సు చేసినా రాష్ట్రప్రభుత్వంలో కనీస స్పందన లేదు.

అసలు బిల్లును ప్రవేశపెట్టకుండా ఉండేకంటే కొన్ని లోపాలున్న బిల్లును ప్రవేశపెట్టడం మేలు.

మహిళలకు ఓటు హక్కు కల్పించటానికి బ్రిటన్‌లో శతాబ్దాలపాటు, అమెరికాలో దశాబ్దాలపాటు పోరాటం చేయాల్సి వచ్చింది. దానికి భిన్నంగా కులం, మతం, భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా మహిళలకు పురుషులతో సమానంగా ఓటుహక్కును కల్పించిన ప్రపంచంలో తొలిదేశం భారతదేశం.

చట్టసభల్లో మహిళలు పెద్దసంఖ్యలో ప్రవేశించటం వల్ల రాజకీయాన్ని పునర్‌నిర్వచించి, బహిరంగ చర్చప్రమాణాల్ని పెంచవచ్చు. రాజకీయాలు ఈరోజు నేరసంస్కృతికి అవినీతికి ఆశ్రిత పక్షపాతానికి పర్యాయపదంగా మారాయి. సొంత ప్రయోజనాలు, సంకుచిత నిరంకుశత్వం రాజ్యమేలుతున్నాయి. బహిరంగచర్చ వ్యక్తిగత దూషణలు, అప్రజాస్వామిక భాషగా మారిపోయింది. రాజ్యసభలో మహిళాబిల్లుపై కొన్ని పార్టీల తీరు రాజకీయాల్లో చర్చా ప్రమాణాలు దిగజారుడుతనాన్ని కళ్లకు కట్టినట్లుంది. మహిళలు రావడం వల్ల ఈ పరిస్థితి కొంతైనా మారి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు అవకాశాలు వంటి అంశాలు చర్చనీయాంశమవుతాయి. బహిరంగచర్చ పరస్పర గౌరవం, హేతుబద్ధత, సాక్షాధారాల ప్రాతిపదికన జరుగుతుందని విశ్వసిద్దాం. ❋



ఒగేటి శ్రీదేవి

# నలిగిపోతున్న బాల్యం భవిష్యత్తు అగమ్యగోచరం

మనిషి జీవితంలో ఆనందమయ కాలం అంటే బాల్యమేనని చెప్పుకోవాల్సి వుంటుంది. ఎలాంటి బాదరబందీ లేకుండా గడపాల్సిన సమయమది. ప్రతి వ్యక్తి జీవితంలో సుఖంగా, సంతోషంగా ఉండే సమయం బాల్యం మాత్రమే. అయితే పేద కుటుంబాల్లో పిల్లలకు బాల్యం కూడా ఒక శాపంగా మారింది. 5 నుండి 14 సం॥ల మధ్య వయస్సులో దాదాపు 1 కోటి 35 లక్షల మంది బాలబాలికలకు సంతోషం, సుఖం, ఆటపాటలు కలగానే మిగుల్తున్నాయి. వీరికి బాల్యం చాలా భారంగా గడస్తుంది. చదువుకుంటూ, ఆటపాటలతో గడపాల్సిన సమయంలో, పలకా బలపం పట్టాల్సిన సమయంలో పొట్టకోసం, కుటుంబ అవసరాల కోసం తమ చేతనైనంత వరకు కార్మికులుగా పనులు చేయాల్సివస్తోంది. తప్పనిసరి పరిస్థితులో బాల కార్మికులుగా జీవితం గడపాల్సి వస్తోంది.

**రాజ్యాంగంలో బాలకార్మిక వ్యవస్థ గురించి:**

బాల కార్మిక వ్యవస్థ ఉండకూడదని, ఇది చట్టపరంగా చెల్లదని భారత రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. పిల్లలు స్వేచ్ఛగా వుండే హక్కు భారత రాజ్యాంగం కల్పించింది. బాల బాలికలకు ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం పార్టు - 3 లో చేర్చారు. బాలకార్మిక వ్యవస్థ వుండకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం విధానాల్లోని డైరెక్టివ్ ప్రిన్సిపుల్స్‌లో పేర్కొన్నారు. వెట్టి చాకిరీలో వుండే బాల కార్మికులకు విముక్తి కలిగించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 24 స్పష్టం చేయడమే కాకుండా, వెట్టి నుండి విముక్తి లభించే పిల్లలకు పునరావాసం కల్పించాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**బాలకార్మిక వ్యవస్థకు కారణం**

బాలకార్మిక వ్యవస్థ కొనసాగడానికి అనేక కారణాలున్నాయి. చిన్న, పెద్ద కంపెనీలు, వ్యవసాయ క్షేత్రాలు, గృహావసరాల్లో చిన్న పిల్లలను కార్మికులుగా చేర్చుకుంటున్నారు. బాల కార్మికులకు ఇచ్చే స్వల్పమైన వేతనాల మూలంగా వారికి ఆదాయాలు, ప్రధాన కారణంకాగ, పిల్లలు కార్మికులుగా పనిచేయడం వల్ల తమకు చేదోడు వాదోడుగా ఉండటంతో కొద్దిగా అయినా డబ్బు వస్తుందని తల్లిదండ్రులు భావించడం మరో కారణం దాంతో వ్యక్తిగతంగా, సామాజికంగా పిల్లలు తీవ్రంగా నష్టపోతున్నారు.



బాల కార్మిక వ్యవస్థ ప్రధానంగా రెండు రకాలుగా కొనసాగుతుంది.

1. క్రూరత్వమైన బాలకార్మిక వ్యవస్థ
2. తప్పనిసరి బాలకార్మిక వ్యవస్థ

చాల కుటుంబాల్లో చిన్న కంపెనీల్లో బాలకార్మిక వ్యవస్థ భయంకరంగా లేకపోయినా, తప్పనిసరిగా బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతుంది. పెద్ద కంపెనీలు, హొటళ్ళు, తదితర వ్యాపార సంస్థల్లో క్రూరత్వ పరిస్థితిలో బాలకార్మిక వ్యవస్థ విస్తరించి వుంది. చాలాకాలంగా బాలకార్మిక వ్యవస్థపై పోరాటం జరుగుతుండటంతో దశల వారీగా ఈ విధానం తగ్గుతూ వస్తోంది. నేటికి కొనసాగుతున్న బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నివారించవలసిన అవసరం వుంది.

యునైటెడ్ కింగ్‌డమ్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 5 నుంచి 17 సం॥లు మధ్య వయసున్న 21.80 కోట్లమంది (సుమారుగా) పిల్లలు వెట్టి పనుల్లో వున్నారు. వారిలో 12.60

కోట్ల మంది తీవ్రమైన, కఠినమైన పనుల్లో వున్నారు. వీరిలో 8.40 కోట్లమంది చట్ట వ్యతిరేకమైన, ప్రమాదకరమైన, ప్రాణహాని వుండే పనుల్లో కొనసాగుతున్నారు.

ముఖ్యంగా పిల్లలు ఎనిమిది ప్రమాదకరమైన విభాగాల్లో పనిచేస్తున్నారు.

1. బాల వేశ్యావృత్తి, 2. వేశ్యా వ్యాపారం, 3. వెట్టి, బాలకార్మిక వ్యవస్థ 4. గనుల్లో బలవంతంగా పనిచేయించడం 5. వ్యవసాయ పనుల్లో బలవంతంగా పనిచేయించడం 6. చైల్డ్ కేర్ టేకర్స్ 7.బలవంతపు బాల్య వివాహాలు చేయడం 8. గృహాల్లో పనిచేయించడం.

**ఆంధ్రప్రదేశ్‌లో బాలకార్మిక వ్యవస్థ అయితే**

దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో బాలకార్మిక వ్యవస్థ ఎక్కువగానే వుంది. రాజకీయ కారణాల మూలంగా ఈ వాస్తవం వెలుగులోకి రావడం లేదు. అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐ.ఎల్.ఓ.) నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో 14 లక్షల మంది బాలకార్మికులు పనిచేస్తున్నారు.

**నిర్దిష్టమైన కొన్ని సూచనలు (బాలకార్మిక వ్యవస్థకు)**

1. బాల కార్మిక వ్యవస్థకు ప్రధాన కారణం పేదరికమే. అందుకు తొలుత పేదరిక నిర్మూలన పథకాలు చేపట్టాలి.
2. పరిశోధనా నివేదికల్లో కొంత వ్యత్యాసం వుంది. బాలకార్మిక వ్యవస్థకు కారణాలను తెలుసుకోవడానికి బాలకార్మికుల నుంచి ఖచ్చితమైన వాస్తవాలు తీసుకోవాలి.
3. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పరిస్థితి పరిశీలిస్తే, ఇప్పటికిప్పుడే బాలకార్మిక వ్యవస్థ పూర్తిగా సమసిపోయేలా లేదు. అందుకు బాల కార్మిక విద్య అందుబాటులో వుండేలా, చదువుకునే అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.
4. అన్ని దేశాలు కూడా బాలకార్మికులు చదువుకునే వాతావరణం కల్పించాలి. పనిచేస్తూనే చదువుకొనే అవకాశం వుంటే బాగుంటుంది. పిల్లలు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా చూడాలి.
5. పేద కుటుంబాలు ఒక పర్యాయం ఇక్కట్లకు గురికాకుండా చూస్తూ, వారి పిల్లలకు వసతితో పాటు విద్య అవకాశాలు విధిగా కల్పించడం వల్ల కొంత మార్పు వచ్చే అవకాశం వుంది.

"అందుకే లోక్‌సత్తా తన 50 గ్యారంటీలలో "విద్యతో అందరికి ఎదిగే అవకాశంలో భాగంగా ప్రభుత్వ - ప్రయివేటు విద్యలు ఇకపై సమానం అని, ప్రతి స్కూలుకి ఆధునిక వసతులు కల్పించడం, డబ్బు లేకపోయినా ఎవరి చదువు ఇక ఆగదు అని ముఖ్యంగా బాల కార్మికుల కోసం (అనగా డబ్బు లేక బాల కార్మికులుగా అయిన వారు) లోక్‌సత్తా ప్రకటించడం ఎంతో హర్షదాయకం, గర్వించదగ్గది.

**లోక్‌సత్తా పార్టీ మహిళా విభాగం మహిళాసత్తా ఆధ్వర్యంలో...**

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ

బాలికలు, మహిళలపై అత్యాచారాలు నానాటికీ హెచ్చుమీరుతున్నాయని వాటిని అరికట్టడానికి మహిళలే కాక సమాజంలోని ప్రతి ఒక్కరూ నడుంకట్టాలని మహిళాసత్తా (లోక్‌సత్తా పార్టీ మహిళా విభాగం) రాష్ట్రశాఖ అధ్యక్షురాలు శ్రీమతి ఎన్. సరోజాదేవి అన్నారు. స్థానిక మహిళాసత్తా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.మహిళలపై అత్యాచారాలకు మద్యపానానికి చాలా సంబంధం వుందని, అందుచేత మద్యపానాన్ని కఠినంగా నియంత్రించాలి అని ఆమె అన్నారు.




సభకు అధ్యక్షత వహించిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ ఆలూరి విజయలక్ష్మి అంతర్జాతీయ మహిళాదినోత్సవం ప్రాముఖ్యాన్ని, నేపథ్యాన్ని వివరించారు.

ఈ కార్యక్రమంలో మహిళాసత్తా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి సుహాసిని, లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ పి.చంద్రమౌళి, నగరశాఖ అధ్యక్షులు నెక్కంటి శ్రీనివాస్, వాకాడ సుబ్బారావు, దేవకీదేవి, ఎన్.భానుమతి, రాధాదేవి మొదలైనవారు సభలో పాల్గొన్నారు.

తొలుత మహిళాసత్తా స్థానిక నాయకురాలు శ్రీమతి ఎన్.లీలా సావిత్రి సభకు స్వాగతం తెలిపారు.

# మహిళా శక్తిని ప్రపంచానికి చాటుదాం





మార్చి 8, 2010న కె.పి.హెచ్.బి. కాలనీ భువన విజయం గ్రౌండ్‌లో గ్రేటర్ హైదరాబాద్ మహిళాసత్తా ఆధ్వర్యంలో నిర్వహించిన శత వసంతాల అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి విశిష్ఠ అతిథులుగా హాజరైన మేయర్ బండా కార్తీకరెడ్డి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలకు సరైన అవకాశాలు కల్పించినప్పుడే తమ ప్రతిభ వెలుగులోనికి వస్తుందని వంటింట్లో బంధిస్తే ప్రతిభ కనబడదని తెలిపారు అనాదిగా మహిళలపై జరుగుతున్న దాడులను తిప్పికొడుతూ ఆడది అంటే అబల కాదు సబల అని ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. మహిళలు రాణించాలంటే సమాజంతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సహం కూడా అవసరమని, మగ పిల్లలతో పాటు ఆడవారిని కూడా సమానంగా ప్రోత్సహించాలని తల్లితండ్రులను, కుటుంబ సభ్యులను కోరారు. ప్రతి రంగంలో మహిళలకు జనాభా ప్రాతిపదికన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

స్థానిక ఎమ్మెల్యే మరియు లోక్‌సత్తా పార్టీ అధినేత శ్రీ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ మహిళలు ఇంట్లో చేసే పనులను బయట చేస్తే మగవారికంటే ఎక్కువ జీతాలు అందుకుంటారని అన్నారు. మహిళలు ఆత్మన్యూనత నుంచి బయటపడి ఆత్మగౌరవం పెంపొందించుకోవాలని, సమాజంలో పలువురు అధికార లాలసతో మహిళాభివృద్ధిని అణచివేస్తున్నారని అన్నారు. మహిళలు అధికారం చేపట్టి దానికి సేవే నిర్వచనంగా వ్యవహరించాలని కోరారు.



కార్యక్రమానికి హాజరైన బాలానగర్ తహశీల్దార్ వనజాదేవి ఆడపిల్ల పుట్టినప్పటి నుండి పద్ధతులు పాటించే విషయంలో కట్టుబాట్లు విధించటం వల్ల మహిళలు వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీమతి కోమలిదేవికి ఉత్తమ మహిళా ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఒంగోలు నుండి నాగమణి నేడు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, బాల్యవివాహాలను ఉటంకిస్తూ తన స్వీయరచనాగేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పద్మజారాణి, గజానని, మణిమంజరి, రత్నం, రమాసుభద్ర, మహాలక్ష్మి, సుజాత, మంగళ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీజోన్‌పై నిజాలు చెప్పిందెవరో మర్చిపోయారా?

## ... తెలంగాణపై మడమతిప్పని వైఖరి మాది

**"వాస్తవాలు, సామరస్యత ప్రాతిపదికనే పరిష్కరించుకోవాలి.ప్రజలకు అధికారాన్నివ్వటమే అంతిమ పరిష్కారమని గుర్తించాలి": లోక్‌సత్తా**

వాస్తవాల ప్రాతిపదికన మాట్లాడే శక్తిలేక టీఆర్ఎస్ నేతలతోపాటు తాజాగా కొన్ని సంఘాలవారు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజల్ని పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. అందరి ప్రయోజనాలను సమన్వయం చేయటమే రాజకీయం ప్రధాన లక్ష్యమని, బాధ్యతగల పార్టీ ప్రతినిధిగా తెలంగాణ అంశంపై రాజ్యాంగబద్ధంగా ఆ కర్తవ్యాన్ని జేపీ నెరవేర్చటాన్ని జీర్ణించుకోలేక తమ దివాళాకోరుతనం నుంచి ప్రజల దృష్టిని మళ్లించటం కోసమే ఆయా నేతలు, సంఘాల ప్రతినిధులు జేపీ నిజాయతీని, ఆయన బాధ్యతాయుత కృషిని కించపరిచేరీతిలో మాట్లాడుతున్నారు. **"హైదరాబాద్ ఫ్రీజోన్"** అంటూ వివాదం చెలరేగినప్పుడు అక్టోబర్ 19,2009న ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో జయప్రకాష్ నారాయణ్ మినహా అన్నిపార్టీల నేతలూ అబద్ధాలు చెప్పారని సాక్షాత్తూ తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె. చంద్రశేఖర రావు పలు బహిరంగ సభల్లో కూడా చెప్పారు. ఫ్రీజోన్ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లటం వల్ల ఫలితం ఉండదని, రాష్ట్రపతి ఉత్తర్వులోని 14 (ఎఫ్)ను తొలగించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని జేపీ ఆనాటి అఖిలపక్ష సమావేశంలోనే సూచించారు. మిగిలిన పార్టీలు మాత్రం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న ప్రభుత్వ వైఖరిని బలపరిచాయి. ఆచరణసాధ్యంకాని పరిష్కారానికి మద్దతు తెలిపి సమస్య పరిష్కారం కాకుండా కాలయాపన చేయాలని మిగిలిన పార్టీలు ఆలోచిస్తే, సమస్యను తక్షణం పరిష్కరించి ప్రజలకు మేలుచేసే దిశగా జేపీ కృషిచేశారు... టీఆర్ఎస్ అధ్యక్షుడికే కాదు, ఈరోజు జేపీ గురించి అవహేళనగా, అప్రజాస్వామిక భాషలో మాట్లాడుతున్నవారందరికీ ఆ నిజం తెలుసు. కానీ ఏదోకరకంగా లబ్ధి పొందేందుకు జేపీ మీద బురద జల్లుతున్నారు.

అదేరీతిలో, టీఆర్ఎస్ పుట్టకముందు నుంచీ తెలంగాణ విషయంలో లోక్‌సత్తా ఒకే వైఖరితో, నిజాయతీతో వ్యవహరిస్తున్నా, దాన్ని గుర్తించనట్టు నటిస్తూ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. "తెలంగాణ రావటం ఉపద్రవమూ కాదు, సర్వరోగ నివారిణీ కాదు. అసలు సమస్య రాజకీయరంగంలో ఉంది. రాజకీయ వ్యవస్థను మార్చి అధికారాన్ని ప్రజల చేతుల్లో ఉంచేందుకు వికేంద్రీకరణ చేయటం ద్వారా ప్రజలకు శాశ్వత అభివృద్ధి సాధ్యం. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభాన్ని ఉద్రేకాలతో, అపోహలతో కాకుండా వాస్తవాల ఆధారంగా సామరస్యంగా పరిష్కరించుకోవాలి" అని తొలినుంచీ స్పష్టంగా చెబుతున్నాం. తెలంగాణ ప్రాంతం స్థాయిలోనే కాకుండా రాష్ట్రంలోని ప్రతి జిల్లాస్థాయిలో జరుగుతున్న అన్యాయంపై గళమెత్తాం. జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుకు పోరాడుతున్నాం.

### రాజ్యాంగం అమలులో వైఫల్యాన్ని కూడా రాజ్యాంగబద్ధంగానే సరిచేయాలి

రాజ్యాంగం అందరికీ ఎదిగే అవకాశాలకు హామీనిచ్చినా, సంప్రదాయ రాజకీయపార్టీలు తమ తాత్కాలిక ప్రయోజనాల కోసం కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బతీసే విధానాలను అమలుచేస్తుండటం వల్లే ఈవేళ అభివృద్ధి కేవలం కొన్ని వర్గాలకే పరిమితమై వెనకబాటుతనం నెలకొంది. ఆ రాజకీయాన్ని మార్చటానికి కూడా హింసామార్గంలోకాకుండా రాజ్యాంగబద్ధంగానే పోరాటం చేయాల్సి ఉంది. తెలంగాణ సమస్యకు వాస్తవాలు, సామరస్యత ప్రాతిపదికన మాత్రమే పరిష్కారం రావాల్సి ఉంది. దానికి భిన్నంగా ఉద్రేకాలను రెచ్చగొట్టటం రాజ్యాంగబద్ధ వ్యవహారశైలిని దెబ్బతీస్తుంది. అణగారినవర్గాల ప్రయోజనాలను ఓ ఛత్రంలా రాజ్యాంగం పరిరక్షిస్తుందనే వాస్తవాన్ని విస్మరించకూడదు. "మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో దూరదృష్టితో, సమగ్రంగా రాజ్యాంగాన్ని రూపొందించారు. హింసాత్మక వ్యవహారశైలితో, సంకుచిత దృష్టితో ఆ దార్శనిక పత్రాన్ని ధ్వంసం చేసే వ్యవహారశైలితో దేశంలోని కోట్లాది అణగారిన వర్గాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితిని తీసుకురావద్దు".

**కిషన్‌రెడ్డికి జయప్రకాష్ నారాయణ్ అభినందనలు**

సిద్ధాంతాలు, విధానాలు వేరైనా ఒకే దేశంలో ఒకే ప్రజల సంక్షేమం కోసం కృషి చేయటమే అన్ని పార్టీల లక్ష్యం కాబట్టి... పార్లమెంటరీ విలువల్ని కాపాడటం, బహిరంగ చర్చల్లో ప్రమాణాలు పెంచటం, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడటం ద్వారా రాజకీయాల పట్ల గౌరవాన్ని పెంచేందుకు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షునిగా ఎన్నికైన జి. కిషన్‌రెడ్డి కృషి చేస్తారని ఆకాంక్షిస్తూ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళా అక్షరాస్యతకు మరో ఉద్యమం

- డా॥ సి కృష్ణమోహన్‌రావు

## సాక్షర భారత్

మహిళా అక్షరాస్యత సామాజిక అభివృద్ధికి కీలకం, మహిళా సాధికారతకు మూలం. ఇది మానవ అభివృద్ధికి ప్రధాన సూచిక. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన అనేక పరిశోధనలలో మహిళ అక్షరాస్యత కుటుంబ ఆరోగ్యం, పిల్లల చదువు, శిశు మరణాలు, పౌష్టిక ఆహారం వంటి విషయాలలో తీవ్ర ప్రభావం చూపుతుందని రుజువయింది. మహిళా అక్షరాస్యత, మహిళా సమస్య కాదు సామాజిక సమస్యగా గుర్తించాలి.

భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మహిళా అక్షరాస్యత పెంపుదలకు కృషి జరుగుతుంది. అయితే సామాజిక, ఆర్థిక కారణాల వలన ఈ విషయంలో పూర్తి పురోగతి సాధించలేకపోయాం. ఈ నాటికీ మహిళా అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నాం. 2001 జనాభా లెక్కల ప్రకారం భారత దేశంలో 54.16 శాతం మహిళలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్నారు. అదే పురుషులలో అయితే 75.85 శాతం అక్షరాస్యత ఉంది. అంటే స్త్రీ పురుషుల మధ్య అక్షరాస్యత అంతరం 21.69 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో మహిళా అక్షరాస్యత మరింత తక్కువగా ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం అది స్త్రీలలో 50.43 శాతం, పురుషులలో 70.32 శాతం అక్షరాస్యతా అంతరం 19.89 శాతం.

దేశంలో అక్షరాస్యతను పెంచేందుకు జాతీయ సాక్షరతామిషన్

**భారతదేశంలో స్త్రీ పురుషుల మధ్య అక్షరాస్యత అంతరం**

| సంవత్సరం | అక్షరాస్యతా శాతం | | అక్షరాస్యతలో స్త్రీ, పురుష అంతరం |
|---|---|---|---|
| | పురుషులు | స్త్రీలు | |
| 1961 | 40.39 | 15.33 | 25.06 |
| 1971 | 45.95 | 21.97 | 23.98 |
| 1981 | 53.46 | 28.47 | 24.99 |
| 1981 | 56.38 | 29.76 | 26.62 |
| 1991 | 64.13 | 39.29 | 24.84 |
| 2001 | 75.85 | 54.16 | 21.69 |

**ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ పురుషుల మధ్య అక్షరాస్యత అంతరం**

| సంవత్సరం | అక్షరాస్యతా శాతం | | అక్షరాస్యతలో స్త్రీ, పురుష అంతరం |
|---|---|---|---|
| | పురుషులు | స్త్రీలు | |
| 1961 | 12.03 | 30.19 | 18.11 |
| 1971 | 15.75 | 33.18 | 17.43 |
| 1981 | 24.16 | 46.83 | 22.67 |
| 1991 | 32.72 | 55.12 | 22.40 |
| 2001 | 50.43 | 70.32 | 19.89 |

'సాక్షర భారత్' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. సెప్టెంబరు 8, 2009 నాడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని మన ప్రధాన మంత్రి 'సాక్షర భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**సాక్షరభారత్ ప్రధాన లక్ష్యాలు నాలుగు అవి:**

**1. ప్రాథమిక అక్షరాస్యత** (Basic Literacy): అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం లేని వయోజనులకు ప్రయోజన (Functional) అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం అందించడం.

**2. ప్రాథమిక విద్య** (Basic Education): ప్రాథమిక అక్షరాస్యతను మించి తమ చదువుకొనసాగించేందుకు, నియత విద్యకు సమతుల్యమైన విద్యను పొందేందుకు వయోజన నూతన అక్షరాస్యులకు అవకాశాలు కల్పించడం

**3. నైపుణ్యాభివృద్ధి:** నూతన అక్షరాస్యులు, ఇతరులు వారి సంపాదన, జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి తగు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం

**4. నిరంతర విద్య :** వయోజన నూతన అక్షరాస్యులకు, ఇతరులకు నిరంతర విద్యకు అవకాశాలు కల్పించడం. అక్షరాస్యత, అక్షరాస్యతానంతర, నిరంతర విద్యా కార్యక్రమాలను ఒకదాని తర్వాత మరొకటి వరుస క్రమంలో నడపడం కాకుండా పరస్పర కొనసాగింపుగా కలగలిపి నడపడం 'సాక్షరభారత్' ప్రత్యేకత.

విస్తృత అర్థంలో చూసినప్పుడు 'సాక్షర భారత్' లక్ష్యం అభ్యాసన సమాజాన్ని, జ్ఞాన సమాజాన్ని ఆవిష్కరించడమే.

## నిర్దిష్ట లక్ష్యం

- 15 సంవత్సరాల వయస్సుపై బడిన 7 కోట్ల వయోజన నిరక్షరాస్యులకు ప్రాథమిక అక్షరాస్యతను అందించడం.
- 15 లక్షల వయోజనులకు ప్రాథమిక విద్యను సమతుల్య కార్యక్రమాల ద్వారా అందించడం.
- 15 లక్షల వయోజనులకు వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం.

## ప్రాధాన్యతా వర్గాలు

- వయోజన నిరక్షరాస్యులందరూ ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు. అయితే అసలు బడికి వెళ్ళే అవకాశం లభించని లేదా తాము నేర్చుకొన్న చదువు మరచిపోయిన నిరక్షరాస్య మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.
- సాక్షర భారత్ కార్యక్రమం ప్రధానంగా మహిళా కార్యక్రమం. ఈ కార్యక్రమంలో 85 శాతం మంది లబ్ధిదారులు మహిళలుంటారు. దేశంలో అక్షరాస్యతలో స్త్రీ, పురుష అంతరాన్ని తగ్గించేందుకు సాక్షర భారత్ కృషి చేస్తుంది. ప్రస్తుతం ఈ అంతరం 20 శాతానికి పైనే ఉంది.
- అక్షరాస్యతా శాతం తక్కువ ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అల్ప సంఖ్యాక వర్గాలలోని వయోజన నిరక్షరాస్యులపై ప్రత్యేకంగా శ్రద్ధ కనబరుస్తారు. అల్ప సంఖ్యాక వర్గాలలోని ముస్లింలపై ప్రత్యేకంగా కేంద్రీకరించి పని చేస్తారు. అదే విధంగా అక్షరాస్యతలో వెనకబడిన ప్రాంతాలపైన కూడా దృష్టి కేంద్రీకరిస్తారు.
- పంచాయితీరాజ్ సంస్థలలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యతనిస్తారు. వీరు అక్షరాస్యులుగా మారితే అట్టడుగు స్థాయిలో పరిపాలనా వ్యవస్థ ఎన్నో రెట్లు మెరుగవుతుంది.
- మొదలు గ్రామీణ ప్రాంతాలపై కేంద్రీకరిస్తారు. తదుపరి దశలో గ్రామీణేతర ప్రాంతాలకు విస్తరిస్తారు. భారతదేశంలో సాక్షరతా భారత్ క్రింద ప్రాథమిక అక్షరాస్యత అందించ తలపెట్టిన నిరక్షరాస్యుల సామాజిక, లైంగిక వర్గ వివరాల పట్టిక.

| వర్గం | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| షెడ్యూల్డ్ కులాలు | 4 | 10 | 14 |
| షెడ్యూల్డ్ తెగలు | 2 | 6 | 8 |
| ముస్లింలు | 2 | 10 | 12 |
| ఇతరులు | 2 | 34 | 36 |
| **మొత్తం** | **10** | **60** | **70** |

- రాష్ట్రాల మధ్య, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య అక్షరాస్యతలోని అంతరాలను తగ్గించడం సాక్షర భారత్ ఇంకో లక్ష్యం. వివిధ రాష్ట్రాలలో అక్షరాస్యత శాతం 33 నుండి 88 వరకు ఉంది. ఈ అంతరం తగ్గించడం కోసం కార్యక్రమం మొదటి దశలో, 2001 జనాభా లెక్కల ప్రకారం సగటు మహిళా అక్షరాస్యత 50 శాతం అంతకన్నా తక్కువ ఉన్న జిల్లాలలో కార్యక్రమం అమలు చేస్తారు.
- దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 18 జిల్లాలను మొదటి దశ కార్యక్రమం క్రింద ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో హైదరాబాదు, ఆదిలాబాదు, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో ప్రస్తుతం కార్యక్రమం అమలు చేయడం లేదు. ఆదిలాబాదు జిల్లా సగటు మహిళా అక్షరాస్యత తక్కువే. అయితే నిరంతర విద్యా కార్యక్రమం అమలు చేసిన జిల్లాలనే మొదటి దశలో ఎంపిక చేసిన కారణాన ఈ జిల్లాను ఎంపిక చేయలేదు.

## సాక్షర భారత్ అమలు విధానం / వ్యూహం

అన్ని స్థాయిలలో పంచాయితీరాజ్ సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. కార్యక్రమ నిర్వహణ కోసం పంచాయితీరాజ్ సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక కమిటీలైన జిల్లా లోక్ శిక్షా సమితి, మండల లోక్ శిక్షా సమితి, పంచాయితి లోక్ శిక్షా సమితి, తమ పరిధిలో మొత్తం కార్యక్రమానికి ప్రణాళికలు తయారు చేయడం, అమలు చేయడం, సామాజిక సమీకరణ చేయడం పర్యవేక్షణ చేయడం, మూల్యాంకనం చేయడం వంటి విధులను నిర్వహిస్తారు. మొత్తం కార్యక్రమానికి బాధ్యత వహించి నడిపిస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా రిసోర్సు గ్రూపు ఏర్పాటు చేస్తారు. ఇది జిల్లాపరిషత్ నేతృత్వంలో కార్యక్రమ అమలును పర్యవేక్షిస్తుంది. కార్యక్రమం అమలుకు కావలసిన నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో సమకూరుస్తాయి. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమం అమలులో ఎప్పటికప్పుడు మార్గనిర్దేశకత్వం వహిస్తూ సహకరిస్తాయి. మంచి పర్యవేక్షణ, మూల్యాంకనా వ్యవస్థలను ఏర్పాటు చేసి కార్యక్రమ అమలును పర్యవేక్షిస్తాయి.

'సాక్షర భారత్' అమలుకు కార్యస్థానాలు గ్రామాలు. అందువల్ల కార్యక్రమం అమలులో గ్రామ పంచాయితీ, పంచాయితీ లోక్ శిక్షా సమితి విశిష్ట స్థానం ఉంది. ప్రతి గ్రామ పంచాయితీలో ఒక లోక్ శిక్షా కేంద్రం ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయితీ జనాభా 5000 కంటే ఎక్కువగా ఉంటే ఇంకొక లోక్ శిక్షా కేంద్రం మంజూరు చేస్తారు. ప్రతి లోక్ శిక్షా కేంద్రాన్ని నడపడానికి ఇద్దరు అక్షరాస్యతా సమన్వయకర్తలు (Literacy Co-ordinators) ఉంటారు.

పంచాయితీ లోక్ శిక్షా సమితి ప్రేరక్‌లను ఎంపిక చేస్తుంది. లోక్ శిక్షా కేంద్రం గ్రామ పంచాయితీ పరిధిలో 'సాక్షర భారత్' కార్యక్రమాల నిర్వహణ, అనుసంధాన కేంద్రంగా పనిచేస్తుంది. ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్య, నైపుణ్యాభివృద్ధి, నిరంతర విద్యా కార్యక్రమాలను అభ్యాసకుల నమోదు చేస్తుంది. లోక్ శిక్షా కేంద్రాన్ని గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తారు. అక్షరాస్యతా ఉద్యమానికి సంస్థాగతమైన, యాజమాన్య పరమైన, వనరుల పరమైన సహకారం లోక్ శిక్షా కేంద్రం అందజేస్తుంది.

లోక్ శిక్షా కేంద్రం గ్రామ పంచాయితీ పరిధిలోగల సాక్షర భారత్ లబ్ధిదారులను గుర్తిస్తుంది. వారికోసం ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్య, నైపుణ్యాభివృద్ధి, నిరంతర విద్యా కార్యక్రమాల ప్రణాళికను తయారుచేస్తుంది. గ్రామ పంచాయితీ పరిధిలోగల విద్యావంతులను స్వచ్ఛంద కార్యకర్తలు (వాలంటీర్లు)గా పనిచేసేలా ప్రోత్సహిస్తుంది. పంచాయితీ పరిధిలోని ఆవాసాలలో ఒక్కో కేంద్రంలో 10 మంది వరకు అభ్యాసకులను చేర్చుకొని వాలంటీర్లతో, అభ్యాసకులకు లోక్ శిక్షా కేంద్రం ఆధ్వర్యంలో మ్యాచింగ్ బ్యాచింగ్ చేస్తారు. వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, అక్షర కేంద్రాలకు బోధనాభ్యసన సామగ్రిని సరఫరా, అక్షర కేంద్రాలను పర్యవేక్షించడం, మూల్యాంకన చేయడం వంటి పనుల ద్వారా గ్రామ పంచాయితీ పరిధిలో అక్షరాస్యతా వ్యాప్తిలో లోక్‌శిక్షా కేంద్రం కృషి చేస్తుంది.

లోక్ శిక్షా కేంద్రంలో గ్రంథాలయం, పఠన మందిరాలను నిర్వహిస్తారు. గ్రామ ప్రజలలో పఠనాసక్తిని పెంపొందింపచేసి "అభ్యసన సమాజ స్థాపన" దిశలో లోక్ శిక్షా కేంద్రం కృషి సల్పుతుంది.

అక్షరాస్యతా సాధనలో సామూహిక ఉద్యమ (Mass Campaign) విధానంతోబాటు అవసరాన్ని బట్టి ప్రత్యామ్నాయ పద్ధతులకు కూడా "సాక్షర భారత్" స్థానం కల్పించింది. వాలంటీరు, ఆవాస బోధకుడు, ఆవాస శిబిరాలు పాక్షిక ఆవాస, పాక్షిక వాలంటీరు విధానాలను ప్రాథమిక అక్షరాస్యతా సాధనలో వినియోగించుకోవచ్చు.

రాష్ట్ర అక్షరాస్యతా మిషన్ అథారిటీ (ఎస్.ఎల్.ఎం.ఎ) రాష్ట్ర ముఖ్యమంత్రి / విద్యాశాఖామాత్యుల నేతృత్వంలో 'సాక్షర భారత్' కార్యక్రమం అమలుకు రాష్ట్ర స్థాయిలో పూర్తి బాధ్యత వహిస్తుంది. కార్యక్రమం విజయవంతం చేయడంలో పంచాయితీ రాజ్ సంస్థలకు ఆర్థిక, సాంకేతిక సహాయ సంపత్తిని అందచేస్తుంది.

అక్షర కేంద్రాలలో చదివిన అభ్యాసకుల ప్రాథమిక అక్షరాస్యతను పరీక్షించి వారు ఉత్తీర్ణులైనది లేనిది తేల్చేందుకు రాష్ట్రస్థాయిలో ప్రతి సంవత్సరం సెప్టెంబరు మొదటి వారంలోగా పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన అభ్యాసకులకు యోగ్యతా పత్రాలు అందజేస్తారు. సార్వత్రిక జాతీయ సంస్థ, రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ప్రాథమిక విద్యను పరీక్షించే పరీక్షలు నిర్వహిస్తారు.

ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన, అభ్యాసన సామగ్రిని 'సాక్షర భారత్'లో సరఫరా చేస్తారు.

**(జాతీయస్ఫూర్తి సౌజన్యంతో...)**

# వివాహిత మౌన పోరాటం

**నిజామాబాద్ జిల్లా, సదాశివనగర్**

సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామానికి చెందిన బాణాల సంతోష్ రెడ్డికి, 2006లో మాచారెడ్డి మండల అన్నారం గ్రామానికి చెందిన శ్వేతతో వేములవాడలో వివాహం జరిగింది. దోమకొండ మండల కేంద్రంలో తమ పెళ్లిని రిజిష్టర్ చేయించుకున్నారు. వీరిద్దరి దాంపత్య జీవితం కొంత కాలంగా సాఫీగానే సాగి వారికి ఒక కుమారుడు కూడా జన్మించాడు. కొంతకాలం తర్వాత భార్యభర్తల మధ్య గొడవలు మొదలైన నేపథ్యంలో భర్త సంతోష్ రెడ్డి తన భార్య శ్వేతను వదిలి వెళ్లాడు. నాలుగు నెలల క్రితం సంతోష్ రెడ్డి బాల్కొండ మండలం ఫతేపూర్ గ్రామానికి చెందిన ప్రియాంకను వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య శ్వేత తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. ఇక లాభం లేదని గమనించి కుప్రియాల్ గ్రామంలోని భర్త ఇంటి ముందే తన ఏడాది వయస్సు గల కుమారునితో మౌన పోరాటానికి దిగింది. సమాచారం అందుకున్న



మహిళా సత్తా ప్రతినిధులు ఎకె.లత, కల్పన, పార్వతి, మంజుల, సుశీల, భాగ్యలక్ష్మిలు గ్రామానికి చేరుకొని మౌన పోరాటానికి దిగిన శ్వేతతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్వేత మాట్లాడుతూ తనకు న్యాయం చేయాల్సిందిగా ఎస్పి,సిఐ, డిఎస్పిలను వేడుకున్నట్లు తెలిపారు. వారి నుండి ఎలాంటి స్పందన రాలేదన్నారు.




## డైట్‌లో మహిళాదినోత్సవ సంరంభం (ప్రకాశం జిల్లా)

మైనంపాడు డైట్‌లో ఎన్.ఎస్.ఎస్. నిర్వహణలో జరుగుతోన్న నాయకత్వ శిక్షణా తరగతుల (లీడర్‌షిప్ ట్రైనింగ్)లో భాగంగా మార్చి8,2010నాడు ప్రపంచ మహిళాదినోత్సవం పురస్కరించుకుని విభిన్న కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, అంశంగా ''మహిళ'' నాడు-నేడు., వక్తృత్వపు అంశంగా "మహిళలు ఇంట్లో, సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్ళు - సమాధానాలు", యిలా నిర్వహించి బహుమతులు అందజేశారు. నెల్లూరు జిల్లా సాక్షరతా ఉద్యమంలో భాగంగా ఆనాటి మహిళలు ఉద్యమం చేసిన సారా వ్యతిరేకోద్యమం పైన జన విజ్ఞాన వేదిక సహకారంతో నిర్మించిన "ఆడవాళ్ళు ఏకమైతే" డాక్యుమెంటరీ సినిమా ప్రదర్శించటం, దానిపైన చర్చను జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు డా॥ సి.ఎ. ప్రసాద్ నిర్వహించారు. అనంతరం జరిగిన మహిళాదినోత్సవ సదస్సులో డా॥ రాధాదేవి (లోక్‌సత్తా రాష్ట్ర నాయకురాలు), టి. అరుణ (తెలుగుదేశం), రాజ్యలక్ష్మి (ఎన్.జి.ఓ రాష్ట్ర నాయకురాలు), రచయిత్రి శ్రీవల్లి (హైదరాబాద్) పాల్గొన్న సమావేశానికి డైట్ ప్రిన్సిపాల్ శ్రీ గౌరికుమార్ అధ్యక్షత వహించారు. డా॥ రాధాదేవి తన ప్రసంగంలో ఆరోగ్యం పట్ల మహిళలు తీసుకొనవలసిన జాగ్రత్తలు వివరించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇంటా, ఆఫీసుల్లో బాధ్యతలు నిర్వహించటం మహిళలు బాగా చేయగలుగుతున్నారని, ఇంకా అవకాశాలు కల్పించుకోవటానికి చిన్నతనం నుండి ప్రయత్నించాలని అన్నారు. టి. అరుణ తన ప్రసంగంలో ఆడపిల్లలు ధైర్యంగా వుండవలసిన అవసరం, స్నేహం పెంచుకోవలసిన అవసరం, కలిసి మెలిసి ఉద్యమాలు సాగించవలసిన తీరు సోదాహరణంగా వివరించారు.

## చైతన్యంతోనే అభివృద్ధి (ప్రకాశం జిల్లా) ఒంగోలు

లోక్‌సత్తా పార్టీ అధ్వర్యంలో అఖిలపక్ష మహిళా సమావేశం ఐఎంఏ హాలులో మార్చి8, 2010న పార్టీ అధ్యక్షులు అల్లు శివరమేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ విద్యావంతులయ్యేలా మహిళల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పార్టీ మహిళానేతలు, కార్యకర్తలపై ఉందన్నారు. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మహిళలు ఆత్మహత్యలకు పాల్పడరాదని, చట్టాలు వినియోగించుకుంటూ మనోధైర్యంతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ ప్రశాంతంగా జీవించాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి సి.హెచ్. రత్నకుమారి, ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కుసుమకుమారి, ఎన్. దేవకుమారి, రావుల పద్మ, ప్రముఖ మహిళా న్యాయవాది మెట్ల రాఘవరాణి, భాజపా నేత శ్రీదేవి, రమామణి, అన్నపూర్ణమ్మలు మాట్లాడుతూ మద్యం నియంత్రణపై ప్రతి మహిళ ఉద్యమించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. దానివల్ల వేలాది కుటుంబాలు చిధ్రమవుతుంటే ప్రభుత్వ చూస్తూ ఊరుకుందని విమర్శించారు. చట్టాలకు సంస్కరణలు చేసి సాంఘిక బహిష్కరణ, అరాచకాలు, దురాచారాలు అరికట్టాలని, పని ప్రాంతాల్లో లైంగిక వేధింపులను అరికట్టాలని కోరారు. జిల్లాస్థాయిలో మహిళా సమస్యలు పరిష్కరించేందుకు పార్టీలకతీతంగా ప్రకాశం ఉమెన్ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఫోరం కన్వీనర్‌గా ప్రముఖ న్యాయవాది మెట్ల రాఘవరాణి పనిచేస్తారని, మహిళలంతా తమ సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు రావుల పురుషోత్తం, యర్ర సాంబశివరావు, ఎండీ రఫీ అహ్మద్, ఎం. వెంకటేశ్వరరావు, ఇ. రామారావు, పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు విశేష ప్రాధాన్యం (సంతనూతనపాడు)

సంతనూతలపాడు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మార్చి8, 2010న రాత్రి అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళలచే నిర్వహించిన కోలాటం అహుతులను ఆకట్టుకుంది. సభలో లోక్‌సత్తా నాయకురాలు డాక్టర్ ఎన్.రాధాదేవి, స్థానిక సర్పంచి దుంపా రమణమ్మను వాసవీ, వనిత క్లబ్‌ల సభ్యులు ఘనంగా సన్మానించారు. కోలాటం మాస్టారు పిచ్చియ్యకు జ్ఞాపికలందించారు. కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్ అధ్యక్షులు పద్మనాభుని రాధాకృష్ణమూర్తి, వి.బేబిరాణి, సభ్యులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య నాయకులు ఎంపీటీసీ సుబ్బారావు, గడ్డం కోటేశ్వరరావు, గ్రంథి ప్రసాదరావు, మిగతా నాయకులు పాల్గొన్నారు.

# సర్వజన సత్తా

**బి.సి., ఎస్.సి., ఎస్.టి., మైనారిటీ, ఇ.బి.సి.ల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రాజకీయ చైతన్య వేదిక**





### పశ్చిమగోదావరి (జిల్లా) భీమవరం

భీమవరం పట్టణంలో లోక్‌సత్తా పార్టీ శాఖ అధ్వర్యంలో సర్వజనసత్తా ఎస్సీ. ఎస్.టి, బి.సి, మైనారిటీ, ఇ.బి.సిల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక చైతన్య వేదిక పార్టీ అనుబంధ విభాగం సదస్సు నిర్వహించడమైనది. రాష్ట్ర పార్టీ సర్వజనసత్తా రాష్ట్ర కన్వీనర్ ఈద చెన్నయ్య కో-కన్వీనర్లు మాదెల బాలన్నదొర, కాళ్ళ గాంధీ, అరవ సుదర్శన రావులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పార్టీ అధ్యక్షులు సీతారామరాజు గారి అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది.

భారత రాజ్యాంగానికి 60 ఏండ్లు నిండినా బి.సి,ఎస్సీ. ఎస్.టి, మైనారిటీ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అనుకున్నంత అభివృద్ధిని సాధించలేకపోయాం. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రత్యేక సదుపాయాలు వాటిని అమలు చేయటంలో పాలకులు, రాజకీయ పార్టీల నాయకులు విఫలమైనారు. అందుకే నేడు కుల సంఘాలు తమ ఆత్మగౌరవం కోసం పోరాటాలు చేయవలసిన అవసరం వచ్చింది. లోక్‌సత్తా పార్టీ భావజాలమే నేడు ఈ దేశ ప్రజల, బి.సి,ఎస్సీ. ఎస్.టి, మైనారిటీలకు రాజకీయ పరిష్కారం చూపగలదు. రాజకీయం నేడు ధనమయం, వ్యాపారమయం, కుటుంబపాలన వంటి అరాచక వాదాన్ని ప్రవేశపెట్టి దేశాన్ని, దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని అగౌరపరచి రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది.

### ఓటుబ్యాంకు రాజకీయాలుగా మారిన రిజర్వేషన్‌లు

**రాజమండ్రి, వి.ఎల్.పురం**

మనదేశంలో నిమ్నవర్గాల కోసం చేపడుతున్న రిజర్వేషన్ ఫలాలు ఓటుబ్యాంకుగా మారాయని లోక్‌సత్తా పార్టీ సర్వజన సత్తా రాష్ట్ర సమన్వయకర్త చెన్నయ్య అన్నారు. గురువారం రాజమండ్రిలో స్థానిక ఎవిఆర్.రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ సంఘాల నాయకులతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిమ్నవర్గాల్లో అభివృద్ధి చెందిన వారికి రిజర్వేషన్లు అమలు చేయకుండా పేదలైన వారికే అందించడం వల్ల ఆయా జాతులు అన్ని విధాలా అభివృద్ధికి నోచుకుంటాయని పేర్కొన్నారు. పరిపాలన చేసే స్థాయికి వెనుకబడిన వర్గాలు ఎదగాల్సి ఉందన్నారు. ఆ దిశగా వెనుకబడిన వర్గాలను కార్యోన్ముఖులను చేసేందుకు లోక్‌సత్తా పార్టీ నిర్వహిస్తున్న సర్వజనసత్తాకు తమవంతు సహకార మందిస్తామని వివిధ సంఘాల నాయకులు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు తాళ్ళూరి బాబూరాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, బీసి నాయకులు సంజీవరావు, సూర్యారావు, ఎస్సీ నాయకులు దేవదానం, మైనార్టీ నాయకులు రఫీ, లోక్‌సత్తా నాయకులు ఆర్.చంద్రకళ, డాక్టర్. వివి.రామారావు, సుందర్ సింగ్, సత్యకృష్ణ, సత్యనారాయణరెడ్డి, ఖాదర్‌ఖాన్, పివికె.శేఖర్, భవానిశంకర్ యాదవ్‌లు పాల్గొని ప్రసంగించారు.

### 'అందరికీ సమాన అవకాశాలు'

**విజయవాడ తూర్పు**

కుల, మతాల వ్యత్యాసం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలని సర్వజన సత్తా రాష్ట్ర కన్వీనర్ ఈద చెన్నయ్య పేర్కొన్నారు. లోక్‌సత్తా అనుబంధ సంస్థ సర్వజనసత్తా ఆధ్వర్యంలో '60 ఏళ్ల రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలు, ఈబీసీల స్థితిగతులు' అనే అంశంపై ఆదివారం బెంజిసర్కిల్ వద్ద గల చెన్నుపాటి కల్యాణమండపంలో జిల్లాస్థాయి సదస్సు జరిగింది. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నయ్య మాట్లాడుతూ 60 సంవత్సరాల రాజ్యాంగ చరిత్రలో రిజర్వేషన్లు ఎవరికీ ఉపయోగపడలేదన్నారు.

కులమతాల పేరుతో ప్రజలను బలహీనులను చేసి రాజకీయ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. పుట్టుకతో కులం, మతం అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన

పరిపాలన అందించడమే లోక్‌సత్తా ధ్యేయమన్నారు. మరో అతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావెల ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ జాతులకు రిజర్వేషన్ ఇచ్చే విధానం రూపుమాపి అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.

దేశంలోని ఇతర రాజకీయ పార్టీల్లో కులాలవారీగా ప్రత్యేక విభాగాలు ఉన్నాయని, దీన్ని బట్టి చూస్తేనే రాజకీయ పార్టీలు కులాలను ఏవిధంగా పెంచిపోషిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య మాట్లాడుతూ ఒక కుటుంబానికి ఒకసారి మాత్రమే రిజర్వేషన్ అవకాశం కల్పించే విధానం ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు రిజర్వేషన్ పొందే అవకాశం దక్కడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్వజనసత్తా నాయకులు అనుమోలు రాఘవయ్య, బాలన్న దొర, గాంధీ, సుదర్శన్, మహ్మద్ రఫీ అహ్మద్, మాగంటి వెంకట నాగేశ్వరరావు, నగర నాయకులు చెన్నుపాటి వజీర్, చుండూరి రాజేంద్రప్రసాద్, కేవీవీ బసవేశ్వరరావు, రాజమణి పాల్గొన్నారు. ❋








జాతీయ ప్రభుత్వం నుంచి నిధులవాటా భారీగా పెరిగిన నేపథ్యంలో... రాష్ట్ర ప్రభుత్వం

# స్థానిక ప్రభుత్వాలకు తలసరి రూ.1000 కేటాయించాలి

### ఆంబుడ్స్‌మన్ ఏర్పాటుకు తక్షణం చట్టం చేయాలి : లోక్‌సత్తా డిమాండ్

**లో**క్‌సత్తా పార్టీ చేసిన ప్రతిపాదనలను 13వ ఆర్థిక సంఘం స్వీకరించి ఆ మేరకు జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సులు చేయటం హర్షణీయం. అయితే రాష్ట్రాలకు కేటాయిస్తున్న నిధుల్లో చాలా స్వల్పంగా 2శాతంలోపు మాత్రమే జిల్లాలకు నేరుగా కేటాయించటం అసంతృప్తికరం. ఆ వైఫల్యాన్ని సరిచేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జాతీయ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు దాదాపు రెట్టింపు అయినందున... ఆ నిధుల్లో నుంచి స్థానిక ప్రభుత్వాలకు కేటాయింపులు చేసేలా రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

"13వ ఆర్థికసంఘం సిఫార్సుల ప్రకారం రానున్న ఐదేళ్లలో పన్నులవాటాలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.1,00,616 కోట్లు వస్తాయి. గతంలో ఈ వాటా కేవలం రూ. 57,000 మాత్రమే ఉండేది. పన్నుల డబ్బు కాకుండా వచ్చే ఐదేళ్లలో గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ.13,802కోట్లు అందుతాయి. అవికాక జాతీయ ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు కూడా వస్తాయి... ఈ లెక్కన ప్రతి ఏటా సరాసరిన రూ.25,000కోట్లుపైనే జాతీయ ప్రభుత్వం నుంచి మన రాష్ట్రానికి వస్తాయి. ఇంత పెద్దఎత్తున పైనుంచి నిధులు అందుకుంటున్న రాష్ట్ర సర్కారు తన దిగువన జిల్లాస్థాయి నుంచి స్థానిక ప్రభుత్వాలకు కూడా నిధుల్ని పెంచాల్సుంది. ఏటా తలసరి రాష్ట్రపౌరులకు రూ.1000 కేటాయించి స్థానికంగా 'ప్రజలు ఎన్నుకున్న' వార్డు కమిటీల ద్వారా ఖర్చు చేసే ఏర్పాటు చేయాలి" ఇందుకోసం ప్రతి సంవత్సరం సుమారు రూ.8,000కోట్లు రాష్ట్రప్రభుత్వం కేటాయించాల్సి ఉంటుంది. లక్షా13వేలకోట్ల రాష్ట్రబడ్జెట్‌లో ఇది కేవలం 7శాతం మాత్రమే. తలసరి రూ.1000 ప్రతి పౌరునికీ కేటాయించి ఖర్చు చేసుకునే అధికారాన్ని కూడా స్థానిక ప్రజలకే ఇస్తే చాలా సమస్యలు ఎక్కడికక్కడ తక్షణం పరిష్కారమై సుపరిపాలన దిశగా మార్పు మొదలవుతుంది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలనివ్వాలని 73,74వ రాజ్యాంగ సవరణలు స్పష్టంగా చెబుతున్నా ఆంధ్రప్రదేశ్‌లో వరుస ప్రభుత్వాలు ఇప్పటివరకూ పూర్తి నిర్లక్ష్యం చేశాయి. ఇప్పటికైనా ఆ తప్పిదాన్ని దిద్దే చర్యలు ప్రారంభించాలి.

స్థానిక ప్రభుత్వాలలో అవినీతి జరిగితే కఠిన చర్యలు తీసుకోవడానికి ఆర్థికసంఘం సిఫార్సు చేసినట్టు ప్రత్యేకచట్టం ద్వారా స్వయంప్రతిపత్తి కలిగిన ఆంబుడ్స్‌మన్ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలి. దీనివల్ల అక్కడ అవినీతికి పాల్పడే అధికారులతోపాటు ప్రజాప్రతినిధుల మీద కూడా చర్యలు తీసుకునే వీలు ఏర్పడుతుంది. దాంతోపాటు పంచాయతీరాజ్ సంస్థలకు, పట్టణ స్థానిక సంస్థలకు విడివిడిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి. ❋

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం





## విద్యార్థినులకు బహుమతుల ప్రధానం

**నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ టౌన్**

లోక్‌సత్తా పార్టీ అధ్వర్యంలో మిర్యాలగూడలోని మీనా ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి8, 2010న బహుమతుల ప్రధానం చేసారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశం పై ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. లోక్‌సత్తా నియోజకవర్గ అధ్యక్షులు కుతుబుద్దీన్, మద్ది వెంకటేశ్వర్లు, విశ్వనాధుల రమేశ్ చారి, వెంకటరెడ్డి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షురాలు, అనిత, కపిలవాయిరాధ, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయారావు, కరస్పాండెంట్ మహమూద్ పాల్గొన్నారు.



## సమాచారం పొందడం ప్రజల హక్కు: లోక్‌సత్తా

**హైదరాబాద్, ఆనంద్‌నగర్ కాలనీ**

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులు ప్రజల చెల్లించిన పన్నుల డబ్బులతోనే జరుగుతున్నాయి. వీటిలో అవినీతి, అక్రమాలు ఉన్నాయని అనుమానాలు ఉన్నట్లు మీకు అనిపిస్తే అధికారుల నుంచి సమాచారం పొందే హక్కు మీకుందంటూ యునేటెడ్ ఫోరం ఫర్ ఆర్.టి.ఐ., రాష్ట్ర కన్వీనర్ ఎన్.నాగేంద్రబాబు ప్రజలకు పునరుద్ఘాటించారు. మార్చి7, 2010న పంజాగుట్ట డివిజన్ వెంకటరమణ కాలనీలోని కమ్యూనిటీ హాలులో ఖైరతాబాద్ ఆధ్వర్యంలో సమాచారం హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్.నాగేంద్రబాబు మాట్లాడుతూ.. రేషన్, రహదారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో లభించే సౌకర్యాలపై ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు, ఇతర పథకాల అవకతవకలపై మీరు కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారుల నుంచి పొందవచ్చన్నారు. సమాచార హక్కు చట్టం - 2005 గురించి, ఎలా దరఖాస్తు చేయాలన్న విధానం విపులంగా వివరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఖైరతాబాద్ ఇన్‌ఛార్జి అట్లూరి సుభాషిణి, సనత్‌నగర్ ఇంఛార్జి గంజి శ్రీనివాస్, ఐఎమ్‌డీ సంస్థ నుంచి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిందాల్ వ్యవహారం అసెంబ్లీలో ప్రస్తావనకు వినతి

**విజయనగరం జిల్లా, శృంగవరపు కోట**

జిందాల్ భూ సేకరణలో అవినీతితో పాటుగా మండలంలో జరిగిన గ్రామీణ ఉపాధిహామి పథకంలోని అవకతవకలపై అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి డి.సూర్యారావు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ని కోరారు. అలాగే విజయనగరం జిల్లా వెనుకబాటు తనంలోనే కాకుండా స్థూల ఉత్పత్తిలో 23వ స్థానంలో, తలసరి ఆదాయంలో 22వ స్థానంలో ఉందని తెలిపారు. కనుక విజయనగరం జిల్లాను, ఎస్.కోట నియోజకవర్గంలో ఉన్న సమస్యలను అసెంబ్లీలో చర్చించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ నేత సూర్యారావు విజ్ఞప్తి చేసారు.

## భీమసింగి షుగర్స్‌పై అధ్యయనం పూర్తి

**విజయనగరం**

భీమసింగి సహకార చక్కెర కర్మాగారాన్ని మార్చి9, 2010న ఎ.పి.టి.ఐ.సి. (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ టెక్నికల్ కమిటి) సభ్యులు కృష్ణ మోహన్, వినయ్‌కుమార్, రవికాంత్‌ల బృందం సందర్శించింది. గత అయిదేళ్లకు సంబంధించి కర్మాగారం స్థితిగతులపై అధ్యయనం చేసింది. లాభనష్టాలు, చెరకు విస్తీర్ణం, సాగు, పంచదార ఉత్పత్తి రికవరీ శాతం, ఆర్థిక స్థితిగతులను తెలుసుకుంది. రైతులకు కార్మగారం ఇస్తున్న రాయితీలు, రైతులు

పండిస్తున్న వంగడాలు, తదితర అంశాలను పరిశీలించారు. కార్మాగారం ఎం.డి. చాంబర్‌లోనే మొత్తం పత్రాల పరిశీలన, అధ్యయనం చేయడం గమనార్హం. క్షేత్రస్థాయిలో చెరకు పంట పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా కర్మాగారం వద్దకే కొంతమంది రైతులను పిలిపించి, చెరకు పండించే తీరు, గిట్టుబాటు ధర, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి.ఆనందరావు, కార్మాగారం వ్యవసాయాధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

**నాయకులతో భేటీ**

సి.ఐ.టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, స్థానిక కార్మిక సంఘాల నాయకులతో కమిటీ భేటి అయ్యింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు, ఇతర నాయకులు మాట్లాడుతూ కర్మాగారానికి నష్టం కలిగించే నివేదికలు ప్రభుత్వానికి అందించవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా చెరకు పంటకు గిట్టుబాటు ధర లేనందునే రైతులు ఆసక్తి చూపించలేకపోతున్నారని చెప్పారు. ఇప్పుడిప్పుడే కర్మాగారం లాభాల బాటలో నడుస్తోందని, అధ్యయనాల పేరుతో ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తే పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు.

**ప్రైవేటీకరణపై ఊహాగానాలు**

సుమారు ఆరు నెలల క్రితం కర్మాగారంపై అధ్యయనం చేయడం, మళ్లీ ఇప్పుడు ఇంకొక కమిటీ అధ్యయనానికి రావడం కర్మాగారం ప్రైవేటీకరణలో భాగమేననే ఊహాగానాలు ఉపందుకున్నాయి.

**అధ్యయనానికే....**

కర్మాగార స్థితిగతులను అధ్యయనం చెయ్యడానికే ప్రభుత్వం తమను నియమించిందని కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని కర్మాగారాల్లోనూ ఇది కొనసాగుతుందని బృందసభ్యులు కృష్ణమోహన్, వినయ్‌కుమార్, రవికాంత్‌లు స్పష్టం చేశారు. రైతులు పండించే చెరకు వంగడాలు, కర్మాగారాల అభివృద్ధికి ప్రణాళికలు, ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. ప్రైవేటీకరణలో భాగంగా కమిటీ వచ్చిందని వినిపిస్తున్న వార్తలు అపోహలుగా కొట్టి పారేశారు. నివేదిక అందించడం తమ బాధ్యత అని, తదుపరి నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## నెల్లూరు జిల్లా (గూడూరు)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు రెవెన్యూ డివిజన్ అధికారిగా కొత్తగా పదవీబాధ్యతలు స్వీకరించిన శ్రీరామూర్తిగారిని లోక్‌సత్తా నాయకులు కలిసి అభినందించారు ఈ సందర్భంగా గూడూరు డివిజన్ కన్వీనర్ శ్రీ యన్. వెంకటకృష్ణయ్య 70% గ్రామాల్లోని ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారని వెంటనే మంచినీటి సరఫరాకి ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే రామలింగాపురం స్మశానంలో 'కర్మ, క్రతువులు' నిర్వహించుకోవటానికి 'బోరు'ని ఏర్పాటు



చేయాలని కోరారు. గూడూరు రూరల్ మండల కన్వీనర్ లక్కు కృష్ణారెడ్డి ఉపాధి హామీపథకం కేవలం కొంతమంది పలుకుబడి కలిగిన అధికార పార్టీ వాళ్లకే వుపయోగపడుతోందని చాలామంది జాబ్‌కార్డులు వున్నా పనులు దొరక్క బాధలు పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రామలింగాపురం, మిట్టాత్మకూరు, ఇందూరుపల్లి, వెందోడు, కొండాగుంట, కాండ్ర, పునపారివారి పాళెం గ్రామాల్లో, దళితవాడల్లో దెబ్బతిన్న రోడ్లని నిర్మించాలని కోరారు. మండల యువసత్తా కన్వీనర్ పోలేపల్లి చిరంజీవి డివిజన్‌లోని సంక్షేమహాస్టళ్లలో మెనూ పాటించకుండా, వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థులకు చెల్లించవలసిన ఫీజు రీ-ఎంబర్స్‌మెంట్ చెల్లించలేదని, రాబోయే పరీక్షలకు ఏకాగ్రత దెబ్బతింటోందని అధికారులకు విన్నవించారు. 2008-09 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ యువకులకు ప్రభుత్వం ద్వారా అందవలసిన స్వయం ఉపాధి పథకాలు రాజీవ్‌యువశక్తి పథకంలో కొంతమంది పెద్దల పలుకుబడితో ఒక్కోబ్యాంకు ఒక్కో ఖాతాదారుచొప్పున ఋణమంజూరు చేయడం వలన సక్రమంగా అమలు జరగడం లేదని, దీనిని వెంటనే సరిచేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.



గూడూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డా॥ వెంకటేశ్వర్లు గారిని స్వాగతిస్తూ లోక్‌సత్తా పార్టీ నాయకులు శ్రీ కె. వెంకటకృష్ణయ్య, లక్కు కృష్ణారెడ్డి,

టి. ఇజ్రాయిల్‌కుమార్, ఎస్.కె. షబ్బీర్‌లు హాస్పిటల్‌లో పసిపిల్లలు, శరీరం కాలినవారిని దృష్టిలో వుంచుకొని కరెంటుకోతలను అధిగమించేందుకు జనరేటర్‌ను కొనుగోలు చేయాలని, అత్యవసర సమయాల్లో రక్తం కొరకు నెల్లూరు రెడ్‌క్రాస్ వారిని సంప్రదించవలసి రావడం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా పోతున్నాయని బ్లడ్‌బ్యాంక్ నిర్వహణలో భాగంగా రిఫ్రిజిరేటర్ ఏర్పాటు చేయాలని కోరారు. రోగులకు సరఫరా చేయాలని కోరారు. శానిటేషన్ కాంట్రాక్టు ఆదాయమార్గంగా కాకుండా సేవాభావం కల్గిన వారికి ఇవ్వాలని హాస్పిటల్ చుట్టుప్రక్కల వాతావరణం పరిశుభ్రంగా, పచ్చగా వుంచాలని కోరారు. అలాగే పాతవైరింగ్ స్థానంలో కొత్త వైరింగ్ చేయించాలని, పురాతన ఫ్యాన్లు, లైట్లు మార్చి కొత్తవి బిగించాలని 24 గం॥లు వైద్యులు, సిబ్బంది అందుబాటులో వుండాలని కోరారు. ఆసుపత్రి అభివృద్ధి నిర్వహణలో లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు అందుబాటులో వుండి సహకరిస్తారని సంసిద్ధతను తెలియచేసారు.

**– ఎస్.కె. షబ్బీర్, లోక్‌సత్తా టైమ్స్ ప్రతినిధి గూడూరు డివిజన్**







## విద్య మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు

**తూర్పుగోదావరి జిల్లా, ఐ.పోలవరం**

మార్చి 14వ తేదీన తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ గ్రామంలోని శాంతినికేతన్ హైస్కూల్‌లో లోక్‌సత్తా పార్టీ కార్యకర్త శ్రీ బాల అనంద కుమార్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు "విద్య మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన" సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తాళ్ళ చెరువు గ్రామంలోని మార్గదర్శి పబ్లిక్‌స్కూల్ కరస్పాండెంట్ శ్రీ పేమ్మాడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ వై.డి. రామరావు, కోనసీమ సైన్స్ పరిషత్ ప్రెసిడెంట్ శ్రీ సి.వి. సర్వేశ్వర శర్మ, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన శ్రీ బి. కోటేశ్వరరావు, శాంతినికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీ వెంకటరాజు విచ్చేసారు.

శ్రీ వై.డి. రామారావుగారు ప్రసంగిస్తూ విద్యార్థి దశలో 10వ తరగతి చాలా కీలకమని ఈ దశలో సరైన దిశానిర్దేశం లేకపోతే లక్ష్యం చేరుకోవడం చాలా కష్టమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంకా శ్రీ సి.వి. సర్వేశ్వరశర్మ, శ్రీ బి. కామేశ్వరరావు, శ్రీ అరుణ పోతుమూడి, శ్రీ వెంకటరాజు, ఉపాధ్యాయులు శేఖర్ మరియు ప్రసాద్, జి.కె. కన్‌స్ట్రక్షన్స్ రాజమండ్రి అధినేత శ్రీమతి అనితాజ్యోతి ప్రసంగించారు.



## నగర సమస్యల విజ్ఞాపన పత్రం

**కాకినాడ,**

లోక్‌సత్తా పార్టీ కాకినాడ నగరశాఖ అధ్యక్షుడు నెక్కంటి శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ ఆలూరి విజయలక్ష్మి నగర సమస్యల్ని వెంటనే పరిష్కారించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శ్రీ గోపాలకృష్ణ ద్వివేదికి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు.

### కోనేరు రంగారావు మృతికి లోక్‌సత్తా ప్రగాఢ సంతాపం

మాజీ ఉపముఖ్యమంత్రి కోనేరు రంగారావు మృతికి లోక్‌సత్తాపార్టీ ప్రగాఢసంతాపం తెలియజేసింది. జీవితాంతం పేదల పక్షపాతిగా, దళితుల అభ్యున్నతి కోసం పాటుపడిన పాతతరం నాయకుల్లో కోనేరురంగారావు ఒకరని పార్టీ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. ఒక గ్రామసర్పంచ్‌గా ప్రారంభించి రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రి దాకా ఎదిగిన కోనేరు రంగారావు తాను పనిచేసిన ప్రతిచోటా తనదైన బలమైన ముద్రను వేశారని, పేదల సమస్య ఏది ఆయనదగ్గరికి వెళ్ళినా పరిష్కారానికి నోచుకుంటుందనే నమ్మకం కలిగించేవారని జేపీ చెప్పారు.



# ఝాన్సీ లక్ష్మిబాయి

**1828 - 1858**

ఏ ఇజాలు తెలియని 1850లలో
స్త్రీ ఇజాన్ని చాటిచెప్పిన  వీరవనిత
సాధికారతకు చిహ్నంగా మహిళా సైన్యాధికారులను
నియమించిన మహారాణి
మూడుపదులు నిండని మిసిమి వయసులో
ముష్కరులకు ఎదురొడ్డి పోరాడి
ప్రాణాలను తృణప్రాయంగా
గాలి విసురుకు ఉవ్వెత్తున ఎగసే కురులతో
దత్తపుత్రుని వీపున బిగించి, ఖడ్గం ధరించి,
కళ్ళెం బిగించి, గుర్రపు స్వారీచేస్తూ
ప్రప్రథమ స్వాతంత్ర్య పోరాటాన
ఆంగ్లేయుల పీచమణచ
అపరచండికగా యుద్ధరంగాన ముందుకురికి
గ్వాలియర్ యుద్ధ భూమిలో అసువులు బాసిన
"ఝాన్సీలక్ష్మిబాయి"
పేరు వింటేనే ఒళ్ళు పులకరిస్తుంది
అటువంటి వీరవనితలను కన్న ఈ గడ్డ
అతివల మాన ప్రాణాల హరణకు వేదిక అయ్యింది

## రండి!

కొత్త రాజకీయంతో దౌర్జన్యాన్ని పారద్రోలుదాం
నిజమైన రెండో గణతంత్ర భారతంతో
మహిళా సాధికారత వైపు అడుగులు వేద్దాం



అందుకే....

మనచేత.... మనకోసం... లోకసత్తా పార్టీ


ఉగాది శుభాకాంక్షలు
వికృతి నామ సంవత్సరం
ప్రకృతిని పులకరింపచేసేదే చైత్రం
మనసును పలకరించేదే మన స్నేహం
షడ్రుచుల కలబోత మన బంధం
అనుభూతులతో నిత్య నూతనం
నూతన రాజకీయం కోసం
మన కోసం, మన పిల్లల
ఉజ్వల భవిష్యత్తు కోసం
కొత్త తరం...
కొత్త స్వరం...
లోక్‌సత్తా పార్టీ
లోక్‌సత్తా పార్టీ